PDF Compressor Free Version

Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 27.09.2013, శుక్రవారం సంపుటి : 33 సంచిక : 17 పేజీలు : 12, వెల : ₹ 4


Dr. A.Swaroop Kumar Reddy, M.D.S.,
Professor - Department of Conservative Dentistry
Specialist - Cosmetic, Lasers & Implant Dentistry
CARE SUPER SPECIALITY DENTAL HOSPITAL
16-1/72, Pogathota, Nellore -524 001, (A.P.)
Ph: 0861-2303300, 6555555
Reimbursement Facility For State Government, APSPDCL & SHAR Employees

# లాయర్


వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



బలవంతపు సంకెళ్ళ నుండి.. తెలుగుజాతి ముంగిళ్ళ ముందుకు...

## రాజన్న బిడ్డ

ఉలి దెబ్బలు తింటేనే రాయి సైతం అందమైన శిల్పంగా మారుతుంది. చంద్రగిరి రాజు చేత బంధించబడ్డాకే అన్నమయ్య భక్తితత్వం ఏంటో లోకానికి తెలిసింది. చెరసాలలో నవాబు కొరడా దెబ్బలు తిన్న తర్వాతే రామదాసు రామభక్తికున్న శక్తిని జనం తెలుసుకున్నారు. కష్టాలకు ఎదురీదేవాడు, కన్నీళ్లను అదిమిపట్టేవాడు ఇతరుల కష్టాలను గమనించగలడు. కన్నీళ్లను తుడవగలడు. చరిత్రలో పెద్దపెద్ద భక్తులకే పరీక్షలు తప్పలేదు. ఇక మానవమాత్రుడైన వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఎంత. (మిగతా 10వ పేజీలో)






జగన్ రాకతో... జనం కేక

సీమాంధ్ర ఉద్యమంలో...


## గర్జిస్తున్న 'సింహ'పురి

మిన్నంటుతున్న ఆందోళనలతో నెల్లూరుజిల్లా దద్దరిల్లిపోతుంది. ప్రజలు వ్యక్తిగత పనులకు స్వస్తి చెప్పి సమైక్యాంధ్ర ఉద్యమాన్ని నడిపించడమే తమ పనిగా పెట్టుకుని ముందుకు కదులుతున్నారు.

(మిగతా 10వ పేజీలో)





PDF Compressor Free Version



## ఇకనైనా... దారికొస్తారా?









**నడిపించేవాడు లేకపోతే నడిచేవాళ్ల ఎవరిదారి వాళ్ళు చూసుకుంటారు. ఇప్పటిదాకా వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ పరిస్థితి అదే! జగన్ జైలులో వున్నంతకాలం పార్టీలో నాయకులు ఎవరికి వాళ్లే రాజాలు అన్నట్లుగా వ్యవహరించారు.**

ముఖ్యంగా నెల్లూరుజిల్లాలో చూస్తే వర్గపోరులో కాంగ్రెస్‌ను మించిపోయారు. మేకపాటి బ్రదర్స్ వర్సెస్ కాకాణి వర్గం అన్నట్లుగా అంతర్యుద్ధం నడుస్తుంది. జిల్లా పార్టీపై పెత్తనం కోసం మేకపాటి చేసిన ప్రయత్నం వల్ల విభేదాలు వీధుల కెక్కాయి. తమకు సంబంధంలేని నియోజకవర్గాలలో సైతం మేకపాటి సోదరులు చేయిదూర్చడం వల్ల ప్రతి నియోజకవర్గం లోనూ సమస్యలు తలెత్తాయి. ప్రధానంగా జగన్ పార్టీని పెట్టిన వెంటనే అందులో చేరిన నాయకులను సైతం మేక పాటి దెబ్బతీసే ప్రయత్నం చేసారు. పార్టీ కన్వీనర్‌లుగా వారిని అడ్డుకుని తన అనుచరులను కన్వీనర్‌లుగా పెట్టు కోవడానికి శతవిధాలా ప్రయత్నం చేసారు. కాని ఆయా నియోజకవర్గాలకు మేకపాటిని పక్కనపెట్టి జగన్ కన్వీనర్‌లను ప్రకటించడం జరిగింది. ప్రజలలో ఆదరణ వున్నప్పటికీ, బలమైన కేడర్ వున్నప్పటికి అంతర్గత విభేదాలు పార్టీని నష్టపరుస్తు న్నాయి. ఇప్పుడు జగన్ బయటకొచ్చాడు. ఇంతకుముందులాగా వర్గాధిపతులు తోకలు జాడించడం కుదరకపోవచ్చు.

### తెలుగుదేశం పిలుస్తోంది...

## రండి... తిరిగి రండి

**రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితులను అనుకూలంగా మలచుకునేందుకు తెలుగు దేశం నాయకత్వం పావులు కదుపుతోంది. రాష్ట్ర విభజన జరిగితే తెలంగాణలో ఆ పార్టీ గట్టిగా నిలబడే పరిస్థితి లేదు. ఆశలు పెట్టు కున్నదల్లా సీమాంధ్ర మీదే!**



పాత నేతలకు 'దేశం' ఆహ్వానం

సీమాంధ్రలో కాంగ్రెస్ పూర్తిగా గల్లంతవుతుందనేది తెలుగుదేశంపార్టీ నమ్మకం. కాంగ్రెస్ తెరమరుగైపోతే పోటీ ప్రధానంగా వైయస్సార్ కాంగ్రెస్, తెలుగుదేశంపార్టీల మధ్యే నెలకొని వుంటుందని అంచనా వేస్తున్నారు. అంటే రాష్ట్ర విభజన ద్వారా చంద్రబాబుకు మళ్ళీ అధికారంపై ఆశలు మొలకెత్తినట్లే! అయితే ఇప్పుడు పార్టీపరంగా కేడర్‌ను పెంచుకోవాల్సి వుంది. జగన్ పార్టీలో టిక్కెట్లకు నోవేకన్సీ బోర్డు పెట్టారు. ఇప్పటికే అక్కడున్న నాయకులకు సీట్లు సర్దుబాటు చేయడం కష్టంగా వుంది. ఇక కాంగ్రెస్ నుండి కొత్తగా రావాలనుకునే వాళ్లకు సీట్లివ్వలేరు. కాంగ్రెస్‌ను సీమాంధ్రలో మూసేసే పరిస్థితి రావడంతో ఆ పార్టీ నాయకులు కొంతమంది తెలుగు దేశంవైపు చూస్తున్నారు. మన జిల్లాలో ఈ దిశలో కొందరు నేతల పేర్లు వినవస్తున్నాయి. సీమాంధ్రలో తెలుగుదేశం బాగా పుంజుకుంటుంది. మీ సొంత గూళ్లకు తిరిగిరండి అని తెలుగుదేశం నాయకులు ఇంతకుముందు పార్టీని వీడి వెళ్లినవారిని ఆహ్వానిస్తున్నారు.

రాష్ట్ర విభజనపై కాంగ్రెస్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సర్వేపల్లి ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేసారు. ఆయన ఇక కాంగ్రెస్‌లో కొనసాగే అవకాశాలు కనిపించడం లేదు. వైకాపాలో చేరుతారనే చర్చ జోరుగా సాగుతుంది. ఎక్కడ పోటీ చేయాలనేదాని మీదే ఇంకా స్పష్టత రాలేదు. అయితే ఇదే సమయంలో తెలుగుదేశం వాళ్ళు కూడా ఆయనను ఆహ్వానిస్తున్నారు. ఆయన రాజకీయ ప్రస్థానం మొదలైందే తెలుగుదేశం నుండి. మంత్రిగా పనిచేసింది కూడా ఆ పార్టీలో వున్నప్పుడే! పార్టీలో చేరితే నెల్లూరు లోక్‌సభ సీటును ఆయనకు ఆఫర్ చేస్తున్నట్లు తెలుస్తుంది. అలాగే కోవూరు మాజీఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని కూడా పార్టీలోకి రమ్మంటున్నారు. ఈయన కూడా ఇక కాంగ్రెస్‌లో వుండలేకపోవచ్చు. అయితే వైసిపిలో చేరుదామంటే ఎక్కడా సీటిచ్చే పరిస్థితి లేదు. తెలుగుదేశంలో చేరితే మాత్రం కోవూరు సీటు విషయంలో నమ్మకముంటుంది. అలాగే పార్టీని వదిలి వెళ్ళిన కొమ్మి లక్ష్మయ్యనాయుడు, కంభం విజయరామిరెడ్డి, వంటేరు వేణుగోపాలరెడ్డి వంటి నేతలను కూడా మళ్ళీ పార్టీలోకి తీసుకొచ్చే ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నట్లు సమాచారం.

## జగన్‌కు బెయిల్‌తో జనోత్సాహం





**జగన్‌కు బెయిల్ ఇవ్వగానే నెల్లూరులో బాణాసంచా మోత మోగింది. కార్యకర్తలు, అభిమానులు ఆనందంతో గెంతులు వేసారు. బొట్లు కాల్చి స్వీట్లు పంచారు. జిల్లా అంతటా కూడా వైకాపా కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు.**

ఈ నెల 23వ తేదీన జనాలు టీవీలకు అతుక్కు పోయారు. 54రోజులుగా టీవీలలో సమైక్య ఆందోళనలే ప్రధాన వార్తాంశంగా వుంటూ వచ్చాయి. 55వ రోజు మాత్రం జగన్ బెయిల్ వార్త కోసమే జనం టీవీల ముందు కూర్చున్నారు. జగన్ అభియోగాలు ఎదుర్కొంటున్న 8కంపెనీలలో క్విడ్‌ప్రో జరగలేదని సిబిఐ కోర్టులో మెమో దాఖలు చేయడంతో జగన్ బెయిల్‌పై ఆశలు పెరిగాయి. సాయంత్రం జగన్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరు కావడంతో అభిమానులు, కార్యకర్తలు, నేతల ఆనందానికి అవధులు లేకుండాపోయింది. జిల్లాలోని నగరాలు, పట్టణాలు, గ్రామాలు... ఇలా అన్ని చోట్లా భారీగా బాణా



484రోజులు నల్లచొక్కాధరించి, జగన్‌కు బెయిల్ రావడంతో తెల్లచొక్కా వేసుకున్న అనిల్‌కుమార్

సంచా కాల్చారు. వై.యస్. విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. క్షీరాభిషేకాలు చేసారు. ఆనందంతో కేరింతలు కొడుతూ అభిమానులు బైక్‌ర్యాలీలు నిర్వహించారు. పార్టీ జిల్లా కన్వీనర్ మేరిగ మురళీధర్ నెల్లూరులో జరిగిన సంబరాలలో పాల్గొన్నారు. రూరల్ వైకాపా కార్యాలయం వద్ద కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో, నగర పార్టీ కార్యాలయం వద్ద పి.అనిల్ కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి తమ సంతోషాన్ని ప్రకటించారు. కావలిలో రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి, సూళ్లూరుపేటలో దబ్బల రాజారెడ్డి, గూడూరులో బత్తిని విజయకుమార్, పాశం సునీల్‌కుమార్, బాలచెన్నయ్య, కోవూరులో నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, సర్వేపల్లి నియోజకవర్గంలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వ ర్యంలో సంబరాలు జరిగాయి. 24వ తేదీ జగన్ చంచల్ గూడ జైలు నుండి బయటకొస్తున్న సమయంలో కూడా జిల్లా అంతటా వేడుకలు జరుపుకున్నారు.



### దేశంలోనే పెద్ద ఓడరేవుగా...

## దుగ'రాజ'పట్నం

**ఎన్ని అవాంతరాలు, ఎన్ని అభ్యంతరాలు వ్యక్తమైనా దేశంలోనే పెద్ద ఓడరేవు నిర్మాణానికి వాకాడు మండలంలోని దుగరాజపట్నమే ఎంపికయ్యింది. దుగరాజపట్నంకు జాతీయ హోదా దక్కింది. దేశంలోనే పెద్ద ఓడరేవుగా గుర్తిస్తూ కేంద్రప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది.**

9600కోట్లతో ఓడరేవు ఏర్పాటుకు ఈ ఏడాది మేలో కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలోనే ఈ పోర్టుకు జాతీయ హోదా కల్పిస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల కావడంతో ఇక పోర్టు ఇక్కడేనన్నది ఖాయమైపోయింది. ఈ ఓడరేవులో రాష్ట్ర ప్రభుత్వం 18శాతం వాటా కోరుతుంది.

రాష్ట్రంలో దేశంలోనే అతిపెద్ద ఓడరేవును నిర్మించాలని తలపెట్టి కేంద్రం విశాఖజిల్లాలోని నక్కలపల్లి, ప్రకాశం జిల్లాలోని రామాయపట్నం, నెల్లూరుజిల్లాలోని దుగరాజపట్నంలను పరిశీలనలోకి తెచ్చింది. నావికాదళం అభ్యంతరాలతో నక్కలపల్లిని ఉప సంహరించారు. ఈ దశలో దుగరాజపట్నంను ఎంపిక చేయగా షార్‌సెంటర్ అభ్యంతరం పెట్టడంతో రామాయపట్నం వద్ద మంజూరు చేసారు. అయితే దుగరాజపట్నం వద్ద పోర్టు తేవడానికి తిరుపతి ఎంపీ చింతా మోహన్ ఎంతగానో కృషిచేశారు. రామాయపట్నం వద్దే పోర్టు ఖరారైందనుకున్న తరుణంలో అనూహ్యంగా కేంద్రం దుగరాజపట్నం వద్ద పోర్టును మంజూరు చేసింది.

బ్రిటీష్‌వారి హయాంలోనే దుగరాజపట్నం నౌకాశ్రయంగా ఓ వెలుగు వెలిగింది. 1960 నుండి కూడా ఇక్కడ పోర్టు ఏర్పాటుకు సర్వేలు జరుగుతున్నాయి. ఇక్కడ పోర్టు ఏర్పాటుకు అన్నీ అనుకూలంగానే వున్నాయని సర్వేలు తేల్చాయి. భూసేకరణకు కూడా ఇబ్బంది లేదు. ఇక్కడ పోర్టు నిర్మాణం మొదలైతే చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు, ఓజిలి మండలాలకు మహర్దశ పట్టినట్లే. గూడూరు నుండి దుగరాజపట్నంకు గతంలోనే రైల్వేలైన్ మంజూరైంది. ఇప్పుడు పోర్టు వస్తే రైల్వేలైన్ వేసి తీరాల్సిందే. మొత్తానికి జిల్లాకు రెండోపోర్టు రావడం ఈ ప్రాంత రూపురేఖలు మార్చడానికేననుకోవచ్చు.



సమైక్యాంధ్ర సమ్మెల మూలంగా ఉద్యోగులకు, ఆర్టీసీ కార్మికులకు ఒక నెల జీతం లేకుండా పోయింది. ఈ నెల జీతం కూడా డౌటే!

### ▪ వడ్డీవ్యాపారుల హవా...

## అల్లాడుతున్న ఉద్యోగులు

కొంచెం పెద్ద అధికారులంటే ఒక నెల జీతం రాకున్నా సర్దుకోగలరు. క్రిందిస్థాయి సిబ్బందికి ఒక నెల జీతం ఆగిపోతే ఎన్నో సమస్యలు. నెలకు వచ్చే జీతాన్ని బట్టే వారి జీవితాన్ని ప్లాన్ చేసుకుని ఉంటారు. ప్రతి ఉద్యోగికి కూడా ఏదో ఒక లోన్ వుంటుంది. జీతంలో నుండే లోన్ వాయిదా కట్ అవుతుంది. గత నెల జీతాలు లేకపోవడంతో ఈ లోన్‌ల ఖాతాలకు చెల్లింపులు నిలిచిపోయాయి. బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీలకు ఈ నెలలో టర్నోవర్ బాగా తగ్గింది.

ఇక ఉద్యోగులు, ముఖ్యంగా టీచర్లు, ఆర్టీసీ కార్మికులు ఇంటి ఖర్చుల కోసం అప్పుల బాట పట్టారు. తెలిసినవాళ్లను చేబదుళ్లు అడిగి తీసుకున్నారు. ఇంకొందరు ఇంట్లో వున్న నగలను తీసుకుని మార్వాడీ కొట్లకు వెళ్లారు. వడ్డీ వ్యాపారులకు ఈ నెల చేతినిండా పనయ్యింది. చేబదుళ్లు దొరకని కార్మికులు అధికవడ్డీలకు అప్పులు తెచ్చుకుని ఈ నెల కుటుంబాన్ని నెట్టుకొచ్చారు.

PDF Compressor Free Version



# ఆ క్షణాలు...











**"సెప్టెంబర్ 23వతేదీ సాయంత్రం 3గంటల 50నిమిషాలు"** యావత్ తెలుగుజాతి ఉత్కంఠభరితంగా టీవీల ముందు కూర్చుని ఏంజరగబోతోందో తెలుసుకునే ప్రయత్నంచేసిన క్షణాలు.

**"సాయంత్రం 4గంటలు"** 484రోజులుగా తనకు దూరంగా వున్న భర్త బలవంతపు చెరసాల నుండి ఇంటికి రాబోతున్నాడన్న వార్తను శ్రీమతి భారతి తెలుసుకున్న మధురక్షణాలు.

**"4గంటలా 3నిమిషాలు"** భర్తను కోల్పోయి కోట్లాది మంది తెలుగు ప్రజల అండతో మనోధైర్యంతో జీవిస్తున్న "తల్లి"కి తోడుగా వుండిన ఒక్కగానొక్క బిడ్డను జైలుపాలు చేసిన దుష్ట రాజకీయ నేతల తలపులు తల్లక్రిందులుచేస్తూ తన వంశోద్ధారకుడు 484 రోజుల చెరవాసం నుండి జనవాసంలోకి రాబోతున్నాడని ఓ అమ్మ తన కోడలు ద్వారా అందుకున్న ఆనంద సమాచార క్షణాలు.

**"సెప్టెంబర్ 24వతేదీ సాయంత్రం 4గంటలు"** సరిగ్గా కోర్టు బెయిలు ప్రకటించిన 24గంటల తరువాత కుట్రబంధాలను తెంచుకుని జనారణ్యంలో అడుగుపెట్టిన వై.యస్.జగన్మోహన్‌రెడ్డికి లక్షలాది మంది వై.యస్.కుటుంబ అభిమానులు జైజై నాదాలతో జైలు బయట స్వాగతహారతులు పట్టిన అపురూప క్షణాలు.


**"9గంటలా 46నిమిషాలు"** 484రోజుల తరువాత ఇంటికొచ్చి తనకంటి పాపలైన ఇద్దరు చిన్న పాపలను ఆ నాన్న అక్కున చేర్చుకున్న ఆత్మీయ క్షణాలు.

**"10 గంటలా 5 నిమిషాలు"** ఢిల్లీ పెద్దల గల్లీ రాజకీయాలతో ఇంటికి దూరంగా 484రోజులు గడిపి విజయోత్సాహంతో తిరిగొచ్చిన తన బిడ్డను విజయమ్మ పుత్రోత్సాహంతో ముద్దు పెట్టుకుని దీవించిన అద్భుత క్షణాలు.

జననేత వై.యస్.రాజశేఖరరెడ్డి కుమారుడిగా వై.యస్.జగన్మోహన్‌రెడ్డి జనంచేత అందుకున్న స్వాగత నీరజనాలకు తోడుగా తన కుటుంబసభ్యులు ఉద్వేగభరితంగా గడిపిన ఆనంద క్షణాలను చూసిన ప్రతి గుండె కరిగిపోయింది, ప్రతి కన్నూ చెమర్చింది. హాట్సాఫ్ టు వై.యస్.!

# 5న "డా॥బెగోరె ఏ నోస్టాల్జియా" పుస్తకావిష్కరణ

## ముఖ్యఅతిథిగా వస్తున్న తమిళనాడు గవర్నర్ రోశయ్య



అక్టోబర్ 5న నెల్లూరులోని రావుబహదూర్ రేబాల లక్ష్మీనరసారెడ్డి పురమందిరంలో ఈశ్వర్‌రెడ్డి ఫౌండేషన్‌ల సంయుక్త నిర్వహణలో దిలైఫ్ అండ్ వర్క్ ఆఫ్ "డా॥బెజవాడ గోపాలరెడ్డి ఏ నోస్టాల్జియా" పుస్తకావిష్కరణ జరుగుతుందని డా॥ బెజవాడ గోపాల్‌రెడ్డి అవార్డు కమిటీ అధ్యక్షులు జె.వి.రెడ్డి, కార్యదర్శి బి.వి.నరసింహం తెలిపారు. మాజీ శాసన సభాపతి డా॥అగరాల ఈశ్వర్‌రెడ్డి రచించిన ఈ పుస్తకాన్ని తమిళనాడు గవర్నర్ డా॥కొణిజేటి రోశయ్య ఆవిష్కరిస్తారని తెలిపారు.

కార్యక్రమంలో గౌరవ అతిధులుగా నెల్లూరు గ్రామీణ శాసనసభ్యులు ఆనం వివేకానందరెడ్డి, నగర శాసనసభ్యులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, వదాన్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, లాయర్ వారపత్రిక సంగ్రాహకులు తుంగా శివ ప్రభాత్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. సాహితీప్రియులు, డా॥బెజవాడ గోపాలరెడ్డి అభిమానులు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరుతున్నారు.

# దీక్షలో ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం



రిలేదీక్షాశిబిరంలో ప్రసంగిస్తున్న వివేకా, దీక్షలో పాల్గొన్న ఆనం విజయకుమార్‌రెడ్డి, కె.వి.రత్నం, బి.మనోహర్‌రెడ్డి, ఇతర స్కూళ్ల కరస్పాండెంట్లు

రాష్ట్ర విభజనను నిరసిస్తూ జిల్లా ప్రైవేట్ విద్యాసంస్థల జేఏసీ అధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన నెల్లూరులోని వీఆర్‌సి సెంటర్‌లో రిలేదీక్షా శిబిరాన్ని నిర్వహించారు. జేఏసీ కన్వీనర్, రత్నం విద్యాసంస్థల వ్యవస్థాపకులు కె.వి.రత్నం అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నెల్లూరురూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి, నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిలు పాల్గొని సమైక్యాంధ్ర కోసం తమవంతు సహకారాన్నందిస్తున్న ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాన్ని అభినందించారు.

కార్యక్రమంలో వీఆర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విక్రమసింహపురి విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ నాగేంద్రప్రసాద్, ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసులు, వీఆర్ కాలేజీ ప్రిన్సిపాల్ భాస్కర్, లిటిల్ ఏంజెల్స్ స్కూల్ కరస్పాండెంట్ చాట్ల నరసింహారావు, కృష్ణచైతన్య విద్యాసంస్థల కరస్పాండెంట్ చంద్రశేఖరరెడ్డి, వికాస్‌స్కూల్ కరస్పాండెంట్ కర్తం ప్రతాప్‌రెడ్డి, మోడరన్‌స్కూల్ కరస్పాండెంట్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, నేతాజీ పైలెట్ హైస్కూల్ కరస్పాండెంట్ ఎం.వి.సుబ్బారెడ్డి, మైథిలి స్కూల్ కరస్పాండెంట్ బి.మనోహర్‌రెడ్డి, గీతాంజలి ఇంజనీరింగ్ కాలేజీ కరస్పాండెంట్ సుధాకర్‌రెడ్డి, శిల్పా స్కూల్ కరస్పాండెంట్ మల్లికార్జునరెడ్డి, రత్నం విద్యాసంస్థల జి.ఎం రామ్మూర్తినాయుడు, మున్సిపల్ కమీషనర్ శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.




# ట్వీట్‌లు పోటెత్తాయి...

## జగన్ బెయిల్‌పై నెటిజన్ల సందడి

ఈరోజు ప్రపంచంలో ఫేస్‌బుక్‌కు ఎంతటి ప్రాధాన్యత ఏర్పడిందో చూస్తున్నాం. ఏ సంఘటన పైనైనా క్షణాల్లో తమ అభిప్రాయాన్ని వెల్లడించేందుకు విద్యావంతులు, మేధావులు, ఉద్యోగులు నెట్‌వర్క్‌ను చాలా బాగా వాడుకుంటున్నారు. ఒక విషయాన్ని పదిమందికి చేరవేయడంలో సోషల్ నెట్‌వర్క్ ఫేస్‌బుక్ కీలకపాత్ర పోషిస్తుంది. బీజేపీ ప్రధానమంత్రి అభ్యర్థిగా బరిలో వున్న నరేంద్ర మోడీ సోషల్ నెట్‌వర్క్ ద్వారానే ప్రతిరోజూ కొన్ని లక్షల మందికి సందేశాలు పంపగలుగుతున్నారు.

రాష్ట్రంలోనే కాకుండా ఇప్పుడు దేశ రాజకీయాల్లోనూ హాట్‌టాపిక్‌గా మారిన వైయస్ జగన్మోహన్‌రెడ్డి బెయిల్ విషయం కూడా ఫేస్‌బుక్‌లో పెనుసంచలనం సృష్టించింది. 23వ తేదీన జగన్‌కు బెయిల్ మంజూరైందన్న విషయం తెలియగానే నెటిజన్లు ఆనందంతో కామెంట్ల వర్షం కురిపించారు. 'పులి బయటకొచ్చింది', 'జగన్ గాట్ బెయిల్', 'గెట్‌రెడీ ఫర్ బ్యాటిల్', 'ప్రత్యర్థులకు కౌంట్‌డౌన్ స్టార్ట్', 'బాద్‌షా బయటకొస్తున్నాడు... ఇక వార్ వన్‌సైడ్' అనే కామెంట్లతో ఫేస్‌బుక్‌లో పోస్టుల మీద పోస్టులు ప్రత్యక్షమయ్యాయి. వెబ్‌సైట్ల నుండి కూడా జగన్ బెయిల్‌వార్తను షేర్ చేసుకున్నారు. ఫేస్‌బుక్‌లో ఏ పేజీ క్లిక్‌చేసినా జగన్ బెయిల్ వార్తే ప్రధానాంశమైంది. ఫేస్‌బుక్‌లో తాము షేర్ చేసుకున్న స్వీటెస్ట్ న్యూస్ ఇదేనంటూ చాలామంది తమ ఆనందం వ్యక్తపరిచారు. ఇక జగన్‌కు నెట్‌లోనే శుభాకాంక్షలు తెలిపిన వారైతే లక్షల్లో దాటిపోయారు. 'బాబు ఫెయిల్ – జగన్‌కు బెయిల్' అనే పంచ్ డైలాగ్‌లు బాగా పేలాయి. ఆంధ్రప్రదేశ్‌కు, వై.యస్.కుటుంబానికి 484రోజుల క్రిందట దూరమైన ఒక తోడు తిరిగి లభించిందని కొందరు, జగన్ రాకతో సమైక్యాంధ్ర ఉద్యమానికి కొత్త వూపు వచ్చిందని మరికొందరు తమ అభిప్రాయాలు వెల్లడించారు. 'కంగ్రాట్స్ వైయస్సార్‌సిపి... గ్రేట్ విన్... జగన్‌కు బెయిల్ వచ్చింది...' అంటూ మంచు లక్ష్మీప్రసన్న ట్వీట్ చేసారు. ఇలా మరెందరో ప్రముఖులు తమ అభిప్రాయాలను నెట్‌వర్క్ ద్వారా పంచుకున్నారు. ఫేస్‌బుక్ పద్ధతి మొదలైన తర్వాత జగన్ బెయిల్ వార్తకు వచ్చినంత ప్రాధాన్యత ఇంకే సంఘటనకూ రాకపోవడం విశేషం.



# బాడీ బిల్డర్ రాజ్‌సెన్‌కు యుఎస్‌ఏ ఆహ్వానం

నెల్లూరుకు చెందిన మాజీ మునిసిపల్‌కౌన్సిలర్ పెనుబల్లి చంద్రశేఖర్‌రెడ్డి(చంద్రారెడ్డి) కుమారుడు రాజ్‌సెన్‌రెడ్డి పెనుబల్లి(38)కి, యుఎస్‌ఏ, ఐఎన్‌బిఏ, పిఎన్‌బిఏ సంస్థ నుండి ఆహ్వానం అందినట్లు ఒక ప్రక టనలో పేర్కొన్నారు. నవంబర్ 2, 8 తేదీలలో యుఎస్‌ఏ లాస్ ఏంజల్స్‌లో జరిగే ఇంటర్నేషనల్ బాడీబిల్డింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు ఇంటర్నేషనల్ నేచురల్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్(ఐఎన్‌బిఏ) ప్రొఫెషనల్ నేచురల్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్(పిఎన్‌బిఏ) ఫౌండర్ & ప్రెసిడెంట్ డెన్నీ కకోస నుండి ఆహ్వానం అందినట్లు తెలిపారు. రాజ్‌సెన్ ప్రస్తుతం న్యూజిలెండ్ మిగ్రైటెడ్‌లో నివాసం వుంటున్నారు. అంతర్జాతీయ స్థాయిలో నెల్లూరుకు పేరుతెచ్చిన రాజ్‌సెన్‌కు 'లాయర్' అభినందనలు.

# గళం.. గళం కలిపి... గర్జిద్దాం!

సమైకాంధ్ర సాధనే లక్ష్యంగా ఈనెల 22న నెల్లూరులో బలిజ సంఘీయులు నిర్వహించిన సింహ గర్జనకు వై.యస్.ఆర్ కాంగ్రెస్ నెల్లూరు రూరల్ సమన్వయ కర్త కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మద్దతు ప్రకటించారు. నెల్లూరులోని గాంధీబొమ్మ వద్ద నిలుచొని సింహగర్జనలో పాల్గొన్న బలిజ సంఘీయులను కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అభినందించారు. వారితో గొంతు కలిపి సమైక్యాంధ్ర నినాదాలను అందించారు.




బలిజ సంఘీయుల సమైక్యగర్జనలో మాట్లాడుతున్న కోటంరెడ్డి

ఈ సందర్భంగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలోనే సమైక్యాంధ్ర ఉద్యమం సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ ఘటన అని రాజకీయ పార్టీల సహకారం లేకుండా ప్రజల ఆకాంక్ష మేరకే జరుగుతున్న స్వచ్ఛంద ప్రజాఉద్యమం అని, అందుకే ఈరోజు నెల్లూరు నగరంలో బలిజ సంఘీయుల సింహ గర్జనకు మద్దతు తెలిపేందుకు తను స్వచ్ఛందంగా ముందుకు వచ్చానని అన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, యన్.జి.ఓ.లు, న్యాయవాదులు, వైద్యులు, వ్యాపారస్తులు, రైతులు, కార్మికులు అన్న తేడా లేకుండా 6సం॥ల పసిపిల్లాడి దగ్గర్నుంచి 60ఏళ్ళ వృద్ధుడు దాకా సమైక్యాంధ్ర ఉద్యమంలో కదం తొక్కుతున్నారని ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్ళు తెరచి విభజన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. 22న నెల్లూరులో జరిగిన బలిజ సంఘీయుల సింహగర్జన సమైక్యాంధ్ర ఉద్యమానికి మరింత ఊపును, ఉత్సాహాన్ని ఇస్తుందని అన్నారు.

ఈకార్యక్రమంలో జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు మందా బాబ్జి, జనార్ధన్‌రెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

PDF Compressor Free Version






## అవే తప్పులు

అభివృద్ధినంతా ఒకేచోట కేంద్రీకరించడం వల్లే అనమానతలు తలెత్తుతున్నాయి. అందరు ముఖ్యమంత్రులు హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయబట్టే ఈరోజు అందరూ హైదరాబాద్ కావాలంటున్నారు. ఇది తెలిసి కూడా ఐటి ప్రాజెక్ట్‌ను మళ్లీ హైదరాబాద్‌కే కేటాయించారు. దీని బదులు సీమాంధ్ర ప్రాంతాల్లో పెడితే అక్కడ ఉద్రిక్తతలన్నా తగ్గేవి కదా!

బి.శ్రీనివాసులు, నెల్లూరు.

## పూజారి వరమివ్వలేదు

దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వలేదు. ఆంధ్ర ప్రాంతంలో 13జిల్లాల్లోని పెన్షనర్లకు గత నెలలో ఎంత పెన్షన్ ఇచ్చారో అంత మొత్తం వారి పెన్షన్ అకౌంట్లకు జమ చేయమని అన్ని బ్యాంకులకు ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. సెప్టెంబర్ 2వ తేదీ సమైక్యాంధ్ర జేఏసి పిలుపు మేరకు బ్యాంకులు మూసివేసినట్లు నోటీసుబోర్డు తగిలించాయి. సీనియర్ సిటిజన్స్ నివ్వెరపోయారు. జేఏసి నేతలు మంత్రుల చేత రాజీనామా చేయించలేకపోయారు. బ్యాంకు సిబ్బంది లోకువా? పాపం, వారు భయపడి బ్యాంకులు మూసారు.

కురుగూరు రంగనాథం, నెల్లూరు.

## చదువులు పోతున్నాయి

ఎడతెగకుండా జరుగుతున్న సమైక్యాంధ్ర ఆందోళనల మూలంగా విద్యార్థుల చదువులు దెబ్బతింటున్నాయి. ప్రభుత్వబడులు ఇప్పటికే మూతపడగా ప్రైవేట్ విద్యాసంస్థలు వారంరోజులు సెలవు ప్రకటించాయి. ఇక పిల్లలు వారి సిలబస్‌ను ఎలా పూర్తిచేయగలరు. ఇంత మంది ఇన్ని ఇబ్బందులు పడుతున్నా కాంగ్రెస్‌పార్టీ మొండి వైఖరిని చూస్తే తాను పట్టిన కుందేలుకు మూడేకాళ్లు అన్నట్లుగావుంది. ఇన్ని కోట్లమంది ప్రజలు ఇబ్బంది పడుతుంటే కాంగ్రెస్‌పెద్దలకు కనీసం చీమ కుట్టినట్లుగా కూడా లేదు. కేంద్రం మొండివైఖరిపై రాజ్యాంగపరంగా యుద్ధం చేయాలి. న్యాయస్థానాలలో పోరాడాలి. బంద్‌లు మాని ప్రజా జీవనాన్ని మామూలు స్థితిలోకి తీసుకురావాలి.

కాటిరెడ్డి యలమందారెడ్డి,
సూళ్లూరుపేట.

## 'ప్రభా'తం

ఆయన పార్లమెంట్‌లో కళారాణి కథలు చెబుతుంటాడు. సాధారణ వ్యక్తిలాగా డాబాలలో కూర్చుని ఛాయ్ తాగుతాడు. పేదల లోగిళ్లలోకి వెళ్లి తాను పేదల మనిషినని చెప్పుకునే ప్రయత్నం చేస్తాడు. భారతదేశ సౌందర్యమంతా మురికి కూపాల్లోనే వుందని నమ్ముతాడు. తనను తాను దేశానికి గొప్ప నాయకుడిగా మలచుకునేందుకు అవసరమైన దానికంటే ఎక్కువగానే సర్కస్‌ఫీట్లు చేస్తుంటాడు. ఇన్ని చేస్తున్నా అసలు ఆయనను ఈ దేశ ప్రజలు నాయకుడిగా అంగీకరిస్తారా?

వచ్చే లోక్‌సభ ఎన్నికల ద్వారా రాహుల్‌గాంధీని దేశ ప్రధానిని చేసి తమను తాము మైమరచిపోవాలని భావిస్తున్న కాంగ్రెస్ నేతల కోరిక ఎంతమాత్రం నెరవేరబోతుందనేది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. 2004 ఎన్నికలప్పుడు రాహుల్ గురించి ఆలోచన చేయలేదు. 2009 ఎన్నికలప్పుడు కూడా ప్రధానిగా ఆయన పేరును తెరమీదకు తేలేదు. అప్పటికి ఆయనకు రాజకీయ అనుభవం అంతగా లేదన్నారు. అప్పటికి ఇప్పటికి ఆయనలో తేడా 9ఏళ్ల వయస్సు పెరగడమే. ఈమధ్యే మన ప్రధాని మన్మోహన్‌సింగ్ కూడా చాలా స్పష్టంగా చెప్పారు అబ్బాయి రాహుల్‌కు ప్రధానపదవి చేపట్టడానికి అన్ని అర్హతలు వచ్చేసాయని, ఆయన క్రింద పనిచేసి తన జన్మను సార్థకం చేసుకోవడానికి తాను సిద్ధంగా వున్నానని. ప్రధానమంత్రికి కావాల్సిన అర్హతలు ఏమిటో మన్మోహన్‌సింగ్‌కు తెలుసు కాబట్టే ఆయన రాహుల్‌కు సర్టిఫికేట్ ఇచ్చాడు. మరి రాహుల్‌కు వున్న అర్హతలను ప్రజలు గుర్తిస్తారా? లేదా? అన్నదే చూడాలి.

పేదరికం అనేది ఒక మానసిక దౌర్భాగ్యం అని ఆయన చెప్పడంలోనే దేశప్రజల పట్ల ఆయన అవగాహన ఎలాంటిదనేది అర్థమవుతుంది. నేను కోటీశ్వరుడినని ఒక నిరుపేద మనసులో అనుకుంటే కోటీశ్వరుడైపోతాడా? అవినీతిపై పోరు సాగించిన అన్నాహజారేపై ఆయన చేసిన వ్యాఖ్యలు కూడా ప్రజల్లో ఆయన పట్ల వ్యతిరేక భావాలను పెంచాయి. కాంగ్రెస్ అంటే తమ కుటుంబ పార్టీ అనే భావన ఆయన రక్తంలోనూ వుంది. మా కుటుంబసభ్యులే ప్రధానిగా వుండుంటే బాబ్రీ మసీదు కూలేదా అంటూ ఆయన గతంలో చేసిన వ్యాఖ్యలు కూడా వారసత్వ రాజకీయాలకు అద్దంపట్టాయి. ఇక నరేంద్ర మోడీ లాగా తాము పారిశ్రామిక వర్గాలకు పెద్దపీట వేయబోమని, పేదలను కూడా విమానమెక్కించాలన్నదే తమ లక్ష్యమని ఇటీవల రాహుల్ చెప్పుకొచ్చారు. ఒక వర్గాన్ని అభివృద్ధి చేయాలనుకోవడం సముచితమే, అదే సమయంలో మరో వర్గాన్ని కించపరుస్తూ మాట్లాడడం ఆయన రాజకీయ పరిణితిని ప్రశ్నిస్తుంది. పారిశ్రామిక వర్గాల వారు మాత్రం ఈ దేశపౌరులు కాదా? ఈ దేశాభివృద్ధిలో వారికి భాగంలేదా? ఇవన్నీ ఒకెత్తయితే ఆయన నాయకత్వం ఎంత వికారంగా వుందనేది ఆంధ్రప్రదేశ్‌లో తలెత్తిన పరిణామాలను బట్టే తెలుసుకోవచ్చు. ఓట్ల బ్యాంకులకు సంబంధించిన అంశాలైతే వెంటనే స్పందించే రాహుల్‌బాబు రెండు నెలలుగా ఆంధ్రప్రదేశ్ ఆందోళనలతో మండిపోతున్నా దీనిపై కనీసం నోరుమెదప లేదు. రాష్ట్రంలోని 13జిల్లాల్లో రెండు నెలలుగా ఆందోళనలు జరుగుతున్నాయి. ఉద్యమాలు తారాస్థాయికి చేరాయి. ప్రజల జీవనపరిస్థితులు దెబ్బతిన్నాయి. ఆర్థిక వ్యవస్థ పతనమైంది. అద్వానీ, సుష్మాస్వరాజ్, నరేంద్ర మోడీ, ప్రకాశ్‌కారత్ వంటి జాతీయ నాయకులు సైతం ఈ సమస్యపై స్పందించారు. కాని రాహుల్‌గాంధీ నోటి నుండి ఈ విషయంలో ఒక్క మాట కూడా రాలేదు. ఆయన చొరవ చూపిస్తే ఆయన పరిధిలోనే ఈ సమస్య పరిష్కారమవుతుంది. కాంగ్రెస్‌పార్టీ ఈ సమస్యను సృష్టించిందే ఆయన కోసం. మరి ఈ సమస్యను ఆయనే పరిష్కరించడానికి ప్రయత్నించి వుండొచ్చు. ఆయన చెబితే కాంగ్రెస్‌లో ఎవరూ కాదనలేని పరిస్థితి. ప్రధాని మన్మోహన్‌సింగ్ కూడా ఆయన క్రింద పనిచేయడానికి పచ్చజెండా వూపేసుకున్నాడు. కాబట్టి ఆయనకు అడ్డమేముంది. కనీసం సీమాంధ్రలో పరిస్థితులను శాంతింపజేసే విధంగా ఒక ప్రకటనన్నా ఆయన చేసుండాలి. కాని అలా జరగలేదు. రాష్ట్ర పరిణామాలపై ఆయన ఒక్క మాటా మాట్లాడలేదు. రాష్ట్ర విభజన విషయంలో కాంగ్రెస్‌పెద్దలు ఏ శాడిజంతో ఉన్నారో రాహుల్‌లోనూ అదే శాడిజం కనిపిస్తుంది. సీట్లు, ఓట్ల కోసం ప్రాంతీయ వైషమ్యాలను సమర్థించే రాహుల్‌ను జాతీయ స్థాయి నాయకుడిగా జనం చూడగలరా?

ఇక ఇమేజ్‌పరంగా చూసుకున్నా రాహుల్‌ను ప్రధాని కావాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్‌వాదులు కోరుకుంటున్నారు తప్పితే దేశప్రజలు కోరుకోవడంలేదు. కాంగ్రెస్‌కు ఇది సంధికాలం. సవాలక్ష సమస్యలు సృష్టించి దేశాన్ని గబ్బుపట్టించడమేకాక పార్టీని కూడా గబ్బు చేసుకున్నారు. ఈ దశలో కాంగ్రెస్‌కు మరోసారి అధికారం అప్పగించడమంటే ప్రజలు తమ కంట్లో తాము మట్టిపోసుకోవడమే అవుతుంది. ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను నిమిత్తమాత్రుడిగా చేసి సర్వాధికారాలు చెలాయించిన సోనియాగాంధీ ఇప్పుడు పార్టీని రక్షించే పరిస్థితుల్లో లేదు. పీఎం కార్యాలయం వెలుపల జరిగిన నిర్ణయాలవల్లే దేశం రకరకాల సంక్షోభాలలో కూరుకుపోయింది. కాంగ్రెస్ నిర్వాకాన్ని ప్రజలు జీర్ణించుకునే పరిస్థితి లేదు. రాహుల్‌ను తమపై రుద్దాలని కాంగ్రెస్ చేసే ప్రయత్నాలను ప్రజలు సమర్థవంతంగా తిప్పికొట్టే అవకాశాలు బలపడుతున్నాయి.

### ప్రధానిగా పనికొస్తాడా?



రెండునెలలుగా సీమాంధ్రలో ఎడతెరిపి లేకుండా ఉద్యమాలు జరుగుతున్నాయి. 5కోట్ల మంది ప్రజలు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఇబ్బంది పడుతున్నారు. దీనికి ప్రత్యక్షబాధ్యత కాంగ్రెస్‌పార్టీదే. కాని ఇంతమంది ప్రజల ఇబ్బందిపై ఒక్క ప్రకటన కూడా చేయని రాహుల్‌కు ప్రధాని స్థాయి వుందా అనేది ప్రశ్నార్థకం.

## 'అంతర్'జాతీయం

- నైరోబీలోని వెస్ట్‌గేట్ వాణిజ్య సముదాయంలో ఉగ్రవాదులు జరిపిన దాడుల్లో 68మంది మృతి చెందారు. వీరిలో ఇద్దరు భారతీయులు కూడా వున్నారు. మొత్తం 15మంది ఉగ్రవాదులు ఈ దాడిలో పాల్గొన్నట్లు గుర్తించారు.
- ఈ నెల 22వ తేదీన పాకిస్థాన్‌లోని పెషావర్‌లో వున్న చారిత్రాత్మక చర్చిపై ఇద్దరు ఉగ్రవాదులు ఆత్మాహుతి దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో 78మంది మృతి చెందగా 130మంది గాయపడ్డారు. పాకిస్థాన్ చరిత్రలో క్రైస్తవులపై జరిగిన అతిపెద్ద దాడిగా దీనిని పేర్కొనవచ్చు.
- శ్రీలంకలోని ఎల్‌టీటీఇ ప్రభావం గల ఉత్తర రాష్ట్రంలో పాతికేళ్ళ తర్వాత జరిగిన ఎన్నికల్లో తమిళ పార్టీ తమిళ్‌జాతీయ కూటమి ఘనవిజయం సాధించింది. ఆదివారం వెలువడ్డ ఫలితాలలో ఆ పార్టీకి 30సీట్లు దక్కగా పాలక యూపిఎఫ్‌ఏకు 7సీట్లు దక్కాయి.
- విదేశాల్లో వున్న నల్లధనాన్ని వెనక్కి తీస్తే భారతదేశం సుసంపన్నమవుతుందని, దేశంలో నిరుద్యోగసమస్యను పరిష్కరించవచ్చునని ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు రవిశంకర్ గురూజీ పేర్కొన్నారు. 22వ తేదీన బళ్లారిలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నల్లధనం వెలికి తీస్తే ప్రతి కుటుంబానికి 3లక్షల నగదు దక్కుతుందన్నారు.
- దేశంలో వందకుపైగా విమానాశ్రయాల నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయనున్నట్లు ప్రధాని మన్మోహన్‌సింగ్ వెల్లడించారు. 2020నాటికల్లా విమానప్రయాణీకుల రద్దీ 30కోట్లకు చేరవచ్చునన్న నేపథ్యంలో చిన్నప్రాంతాలలో సైతం విమాన సర్వీసులను అందుబాటులోకి తీసుకురావాల్సి వుందన్నారు.
- దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు నెల్సన్ మండేలాకు అంతర్జాతీయ దక్షిణదేశాల సహకార సంస్థ జీవకారుణ్య సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేసింది.
- జర్మనీ ఛాన్స్‌లర్‌గా ఏంజెలా మార్కెల్(59) హ్యాట్రిక్ సాధించారు. పార్లమెంటరీ ఎన్నికల్లో ఆమె నేతృత్వంలోని క్రిస్టియన్ డెమోక్రటిక్ యూనియన్ మళ్ళీ గెలిచింది.
- ఎన్నికల సమయంలో ఒపీనియన్‌పోల్స్‌పై నిషేధం విధించాలని ఈసీ భావిస్తుంది.
- మంగళవారం నైరుతీ పాకిస్థాన్‌ను భూకంపం కుదిపేసింది. కరాచీ, హైదరాబాద్, లార్ఖానా, లాహోర్, రావల్‌పిండి, ఇస్లామాబాద్, సింధుప్రావిన్స్‌లోని పలు నగరాల్లో సంభవించిన భూకంపంతో 80మంది మరణించారు. 100మంది గాయపడ్డారు.

## వార్త వ్యాఖ్య

వార్త :- తెలుగు ప్రజలను చీల్చేందుకు కాంగ్రెస్ యత్నం.
- ఢిల్లీలో చంద్రబాబు.

**వ్యాఖ్య :- మీరు ఒంట్లోని పార్టులనే చీల్చినప్పుడు వాళ్లకు ప్రజలను చీల్చడం పెద్ద లెఖ్ఖా!**

వార్త :- కాంగ్రెస్‌పై ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు. - మాజీమంత్రి జేసీ.

**వ్యాఖ్య :- ఆ దుమ్ము మీమీద కూడా పడుతోంది చూసుకోండి.**

వార్త :- కేంద్రం వైఖరి పుండుమీద కారంలా వుంది.
- ఎంపీ అనంత వెంకట్రామిరెడ్డి.

**వ్యాఖ్య :- పుండు మీద కారంలా కాదు, యాసిడ్‌లా వుంది.**

వార్త :- తెలుగుజాతి లేనే లేదు... ఉన్నదల్లా భారతజాతే.
- జస్టిస్ సుదర్శన్‌రెడ్డి.

**వ్యాఖ్య :- ఇంకా లోతుకుపోతే అసలుండేది మానవజాతే కదా!**

వార్త :- అవసరమైతే సీఎంను తొలగించి విభజన. - పాల్వాయి.

**వ్యాఖ్య :- ఆయనకు మాత్రం ఇలాంటి స్టేట్‌కు సీఎంగా వుంటేనేమి, లేకుంటేనేమి.**

వార్త :- ఇరు ప్రాంతాలకు అనుకూల ప్రకటన చేయాలి. - జేపీ.

**వ్యాఖ్య :- ఇరు ప్రాంతాలవాళ్లు సీట్లు గ్యారంటీ ఇస్తే అలాగే చేస్తారు.**

వార్త :- అమ్మ ఆశీస్సులతో సీఎం అవుతానేమో! - కేంద్రమంత్రి సర్వే.

**వ్యాఖ్య :- సోనియమ్మ ఆశీస్సులుంటే సీఎం ఏంటి, మన్మోహన్‌సింగ్ లాగా పీఎం అయినా కావచ్చు.**

వార్త :- యువత రాజకీయాల్లోకి రావాలి. - సీతారాం ఏచూరి.

**వ్యాఖ్య :- ఈ నికృష్టపు రాజకీయాల్లోకి వచ్చి వాళ్లే చేస్తారు?**

వార్త :- మతకలహాలపై ఉక్కుపాదం మోపండి.
- ఎన్‌ఐసి సదస్సులో ప్రధాని.

**వ్యాఖ్య :- పోలీసులకు అలాంటి పాదాలు తయారు చేసివ్వండి.**

వార్త :- తేదేపాతో పొత్తు వుండదు. - కిషన్‌రెడ్డి.

**వ్యాఖ్య :- ఇన్నిసార్లు చెబుతున్నారంటే ఉన్నట్లే...?**

వార్త :- బెయిల్ వచ్చినంత మాత్రాన నిర్దోషి కాదు.
- జగన్‌పై సిపిఐ నారాయణ.

**వ్యాఖ్య :- మీరు సర్టిఫికేటివ్వాలా?**

PDF Compressor Free Version



# పిల్లల చేతికి వాహనాలు ⇨ అరచేతిలో ప్రాణాలు

సరిగ్గా పదిహేనేళ్ళు కూడా నిండని ఓ కుర్రకారు మైనరు తన స్నేహితులతో కలిసి కారు నడిపి అతివేగంగా ఓ గుడిసె లోకి దూరి ఇద్దర్ని ఢీ కొట్టి అమాయకులైన నిర్భాగ్యులకు కష్టాలు తెచ్చిపెట్టాడు. నెల్లూరు ఒకటవ నగర పోలీసుల సమాచారం మేరకు నెల్లూరు నగరం మెక్లిన్స్ రోడ్డులో కాపురముంటున్న షేక్ముజీద్‌కు 14ఏళ్ళ కుమారుడు ఉన్నాడు. సోమవారం మధ్యాహ్నం ఆ పిల్లవాడు తన తండ్రి మారుతిజెన్ తీసుకొని తన స్నేహితులను ఎక్కించుకొని అప్రాంతంలో వేగంగా చక్కర్లు కొడుతున్నాడు. తన స్నేహితులు బాలుడి వేగానికి రెట్టింపు కేకలు వేయడంతో మరింత ఉత్సాహంతో ఆ బాలుడు యమాస్పీడుతో వెళుతూ వేగంలో కారును నియంత్రించలేక ఆ కారును అక్కడేవున్న ఓ గుడిసె లోనికి పోనిచ్చాడు.

ఆ ఇంట్లో ఉన్న అయిదేళ్ళ చిన్నారి అర్షియా, మరో మహిళ దిల్‌షాద్ ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. రక్తగాయాలైన ఇద్దరిని స్థానికులు హుటాహుటీన నారాయణ ఆసుపత్రికి తరలించారు. ఆగ్రహించిన స్థానికులు కారును ధ్వంసం చేసారు. పిల్లలను చితకబాది పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. బాలుడి కోరికను నియంత్రించాల్సిన తల్లిదండ్రులు ఇలా ప్రోత్సాహించడంతో ఇద్దరి ప్రాణాల మీదకు వచ్చింది.

పాప పరిస్థితి విషమంగా ఉంది. దిల్‌షాద్ అనే మహిళ తీవ్రగాయాల పాలైంది.

# నిర్మానుష్యంగా బస్టాండ్

ఆర్టీసీ సమ్మె మొదలుకాకముందు వరకు నెల్లూరు ప్రధాన ఆర్టీసీ బస్టాండ్ ఎలా వుండేది... ఏ ప్లాట్‌ఫాం ఖాళీగా వుండేది కాదు. ఒక ప్లాట్‌ఫాంలో బస్సు ఖాళీ అయితే వెంటనే ఇంకో బస్సు ఆగేది. ప్లాట్‌ఫారాలు దొరక్క కొన్నిబస్సులు చాలాసేపు పక్కనే ఆగేవి. ప్రతిరోజూ జిల్లాలోని గ్రామాలను మొదలుకొని తిరుపతి, బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్, విజయవాడ, కర్నూలు, కడప, అనంతపురం... ఇలా అన్ని ప్రాంతాలకు వందలసంఖ్యలో ఈ బస్టాండ్ నుండి బస్సులు రాకపోకలు సాగిస్తుండేవి. ఆర్టీసీ సమ్మె మూలంగా ప్రధాన బస్టాండ్ నిర్మానుష్యంగా మారింది. ఉద్యోగులు, కార్మికులు రాకపోతుండడంతో ఇక్కడ లైట్లు కూడా వెలగడం లేదు. ఎప్పుడుచూసినా పందులు పొర్లాడుతూ కనిపిస్తున్నాయి. ఇక బస్టాండ్‌లో షాపులు మూతపడ్డాయి. బస్సులు, ప్రయాణీకులు లేకపోతే దుకాణాలు తెరచి మాత్రం ఏం లాభం. ఒకటిన్నరనెల క్రితం వరకు కళకళలాడుతూ కనిపించిన బస్టాండ్ ఇప్పుడు వెలవెలబోతుంది.

# జగన్ కోసం హైదరాబాద్ వెళ్లిన నెల్లూరు నేతలు

జగన్ చెంచల్‌గూడ జైలు నుండి విడుదలౌతున్నాడని తెలిసి సోమవారం సాయంత్రమే పెద్దసంఖ్యలో వైకాపా నాయకులు, కార్యకర్తలు హైదరాబాద్ బయలుదేరారు. మంగళవారం చెంచల్‌గూడ జైలు వద్దకు చేరి ఆయన కోసం నిరీక్షించారు. జగన్ విడుదల తర్వాత జరిగిన ర్యాలీలోనూ పాల్గొన్నారు. మేకపాటి రాజమోహన్‌రెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిలు జగన్‌ను కలిసి ఆత్మీయంగా పలుకరించారు.

# స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆఫర్

## ప్రభుత్వ ఉద్యోగులకు పండుగ అడ్వాన్స్

సమైక్యాంధ్ర ఉద్యమంలో పాల్గొంటున్న ప్రభుత్వ ఉద్యోగులకు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా మంచి ఆఫర్ ఇచ్చింది. గత రెండు నెలలుగా జీతాలు లేకుండా ఇబ్బందులు పడుతూ సమైక్య ఉద్యమాన్ని ముందుకు నడుపుతున్న ఉద్యోగులకు తక్షణ రుణాన్ని మంజూరుచేసేందుకు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ముందుకు వచ్చింది. ఇప్పటికే ఆంధ్రాబ్యాంకు ఖాతాల ద్వారా జీతాలు పొందుతున్న ప్రభుత్వ ఉద్యోగులకు నెలరోజుల జీతాన్ని అందించేందుకు ఆంధ్రాబ్యాంకు ముందు నిలిచింది. నిబంధనల ప్రకారం స్టేట్‌బ్యాంక్ ద్వారా 50వేలు వరకు రుణంగా మంజూరుచేసి ఉద్యోగులకు చేయూత అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఎస్‌బిఐ నెల్లూరు రీజియన్ ప్రాంతీయాధికారి కెవిప్రసాద్ తెలిపారు. ఉద్యోగి అందుకున్న చివరి నెల జీతం ఆధారంగా రుణాన్ని మంజూరు చేస్తామన్నారు. ఎస్‌బిఐలో జీతాలు పొందుతున్న ఉద్యోగులు ఆయా శాఖల్లో సంప్రదించి రుణాలు తీసుకోవచ్చని తెలిపారు.

### డీఎం & హెచ్ ఓ సూపరింటెండెంట్

# మీరావలి సస్పెన్షన్


నెల్లూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖధికారి కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎస్ మీరావలి సస్పెండ్ చేస్తు గుంటూరు జోన్ ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు శాలినీదేవి ఉత్తర్వులు జారీ చేసారు. ఈనెల 17న ఇందుకూరుపేట మండలం జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నిరంజన్ నుంచి లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధకశాఖ అధికారులు పట్టుకున్నారు. దీనిపై వచ్చిన నివేదిక అధారంగా సస్పెండ్ చేస్తూ ఆదేశాలిచ్చారు.

# ప్లాట్‌ఫాం మరమ్మత్తులు

నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో ఒకటో నెంబర్ ప్లాట్‌ఫాంను పొడిగిస్తున్నారు. దీంతో ప్రతిరోజూ ఈ ప్లాట్‌ఫాంపై నిలిచే హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్, నారాయణాద్రి, సింహపురి ఎక్స్‌ప్రెస్‌లను రెండో ప్లాట్ ఫాంపై నిలుపుతున్నారు. ఈ ట్రైన్‌లలో అలవాటుగా ఎక్కేవారు అలవాటు ప్రకారం ఒకటో నెంబర్ ప్లాట్‌ఫాంకు పోకుండా ఈ మార్పును గమనించాలని రైల్వేస్టేషన్ మేనేజర్ షాజహాన్ కోరుతున్నారు.

# కత్తిలా కొత్తిమీరకట్ట

కూరగాయలు కొంటే కొత్తిమీర కట్ట ఊరికినే ఇచ్చేవాళ్లు గతంలో. ఇప్పుడా పరిస్థితి లేదు. ఎర్రగడ్డలతో పోటీ పడుతోంది కొత్తిమీర కట్ట. కిలో ఎర్రగడ్డలు 80రూపాయలు పలికితే... కొత్తిమీర కట్ట ఇప్పుడు 50రూపాయలు ధర పలుకుతోంది. ఇదేమి విచిత్రం. పేదోడు చారు మెతుకులు తినాలన్నా కష్టమైపోతోందిప్పుడు. రానురాను కరేపాకు కూడా కరుగ్గా మారుతుందేమోనని అనుమానించాల్సి వస్తోంది. కూరల్లో, చారుల్లో ఏరిపారేసే కొత్తిమీర సోమవారం ఏసి కూరగాయల మార్కెట్లో కట్ట రూ.50 పలికింది. మామూలుగా అయితే రెండు రూపాయలకు రెండు కట్టలు ఇచ్చే కొత్తిమీర ఒక్కసారిగా యాభైరూపాయలు అయిందంటే... కలియుగం. ఇంక కూరగాయల ధరచూస్తే యథాపలంగా ఆకాశాన్నంటుతున్నాయి. బంద్‌ల ప్రభావంతో కూరగాయల ధరలు ఏమాత్రం దిగిరావటంలేదు.





సెప్టెంబర్ 23వ తేదీన నెల్లూరు ట్రంకురోడ్డులో నిలబడి ట్రాఫిక్ స్థితిగతులను పరిశీలిస్తున్న ఏఎస్పీ కుమారస్వామి

# నెల్లూరు కబుర్లు




## ఎక్కడి సిలబస్ అక్కడే!

ఈ విద్యాసంవత్సరం ఏ మూహూర్తంలో మొదలయ్యిందో గాని అడుగడుగునా అవాంతరాలే! జూన్‌లో పాఠశాలలు మొదలయ్యాయి. పాఠశాలలు తెరచీ తెరవగానే వివిధ సమస్యలపై విద్యార్థిసంఘాలు బంద్‌లు నిర్వహించాయి. దీంతో కొన్ని రోజులు పాఠశాలలు పనిచేయలేదు. వాటి బంద్‌లను తప్పించుకొని ఇక మామూలు వాతావరణంలోకి రాగానే సమైక్యాంధ్ర ఆందోళనలు మొదలయ్యాయి.

రెండునెలలుగా జిల్లాలో పాఠశాలలు సక్రమంగా నడవడం లేదు. ఎప్పుడు బంద్ అంటారో, ఎప్పుడు పాఠశాలలు తెరుస్తారో తెలియని పరిస్థితి. ఈ నెల 23 నుండి 30వరకు వరుసగా బంద్‌తో స్కూళ్లు మూతపడ్డాయి. ఎక్కడి సిలబస్ అక్కడే వుంది. మరోపక్క దసరా సెలవులున్నాయి. ఇంకోపక్క త్రైమాసిక పరీక్షలున్నాయి. సిలబస్ పూర్తి చేయడం కోసం ఇక సెలవు దినాలలో కూడా పాఠశాలలను నడపాలని ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు ఆలోచిస్తున్నాయి. ఒక్కసారిగా సిలబస్ అంతా పూర్తి చేయాలంటే అది విద్యార్థులకు పెనుభారమే అవుతుంది.

## అంతా హైదరాబాద్‌కే దోస్తారా?

\- కర్నాటి




ఐటీ పరిశ్రమల కేటాయింపులో సీమాంధ్రకు అన్యాయం జరుగుతుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐటీఐఆర్‌ను 2.19లక్షల కోట్లతో రెండుదశల్లో హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రివర్గం తీసుకున్న నిర్ణయం సీమాంధ్రలో జరుగుతున్న ఆందోళనలకు ఆజ్యం పోసేదిగా వుందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల పెట్టుబడులతో హైదరాబాద్ ఇప్పటికే అభివృద్ధి చెందిందని, ఐటీఐఆర్‌ను రెండు విభాగాలుగా చేసి కోస్తా, రాయలసీమలలో ఏర్పాటు చేస్తే సీమాంధ్రకు న్యాయం చేసినట్లవుతుందని ఆయన పేర్కొన్నారు.

## సమైక్యాంధ్రకు మద్దతుగా బుల్లెట్ సౌండ్



సమైక్యాంధ్రకు మద్దతుగా బుల్లెట్ వాహనాలపై వాహనదారులు బుల్లెట్ సౌండ్‌తో ఆదివారం నెల్లూరు ఫత్తేఖాన్ పేట నుంచి గాంధీబొమ్మ మీదుగా ఆత్మకూరు బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. బుల్లెట్ వాహనదారులు నెల్లూరు బుల్లెట్ క్లబ్‌ను నూతనంగా ప్రారంభించారు. క్లబ్ ఎంబ్లమ్‌ను రైల్వే డీఎస్పీ జి.శ్రీనివాసులు విడుదలచేసారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ, రాఘవకుమార్, తేజేష్‌చౌదరి, రమేష్‌బాబు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## అల్బేనియా సదస్సుకు పెరుగు రామకృష్ణ



యూరప్‌లోని అల్బేనియాలో ఈనెల 28వతేది జరిగే సదస్సుకు నెల్లూరు వాణిజ్య పన్నులశాఖ ఏసీటీఒ, రచయిత పెరుగు రామకృష్ణకు ఆహ్వానం అందింది. ఈ సదస్సులో కవితాగానం చేయాల్సిందిగా ఆ దేశ అధ్యక్షుడు క్రిష్టాకోఫ్ సభానీ నుంచి ఆహ్వానం అందినట్లు పెరుగురామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో సాహిత్య తులనాత్మక అధ్యయనంపై పత్రాన్ని సమర్పిస్తున్నట్లు తెలిపారు. అక్టోబర్ నెల 5నుంచి 9 వరకు బ్యాంకాక్‌లో ఆసియా పసిఫిక్ రచయితల సంస్థ ఆధ్వర్యంలో జరుగనున్న అనువాద రచనల సదస్సుకు సంస్థ డైరెక్టర్ జాన్ కామెన్స్ నుంచి ఆహ్వానం అందినట్లు తెలిపారు. అక్టోబర్ నెల చివరి వారంలో మలేషియాలోని పేర్క రాష్ట్రంలో జరుగనున్న 33వ వరల్డ్ కాంగ్రెస్ ఆఫ్ పోయెట్స్‌లో కవితాగానం చేయాల్సిందిగా ఆ సంస్థ అధ్యక్షుడు చోఉసదిఎర్ నుంచి ఆహ్వానం అందినట్లు పేర్కొన్నారు. ఈ సదస్సుకు 40భాషల నుంచి 200మంది కవులు హాజరుకానున్నట్లు తెలిపారు.

## కిడ్నీ వ్యాధిగ్రస్థునికి ఆర్థికసాయం

పినాకిని లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా కిడ్నీ వైద్య చికిత్స చేయించుకొన్న రాఘవేంద్రకు 50వేలు ఆర్థికసాయం అందజేసారు. ధర్మవరానికి చెందిన రాఘవేంద్ర కిడ్నీవ్యాధితో బాధపడుతూ భార్య కిడ్నీని మార్పిడి చేసుకునేందుకు పినాకిని లయన్స్‌క్లబ్ వారిని సహాయం చేయాలని కోరగా స్పందించిన లయన్స్ సభ్యులు తిరుపతిలో చికిత్స చేయించుకుంటున్న రాఘవేంద్రకు సోమవారం నగదును అందజేసారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి బయ్యా ప్రసాద్, సభ్యులు రాంప్రసాద్, చంద్రశేఖర్, సుధీర్‌వర్మ, శ్రీనివాసులు, కిషోర్‌కుమార్, తులసి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా భవానీ మాలధారణ



నెల్లూరు నగరం దర్గామిట్టలో వేంచేసియున్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం శ్రీ రాజరాజేశ్వరి సేవా సమితి అధ్యక్షులు సన్నపరెడ్డి పెంచలరెడ్డి నేతృత్వంలో మాలధారణ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకులు తంగిరాల రాధాకృష్ణశర్మ అమ్మవారికి విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించారు. మాలధారణ దీక్ష వస్త్రాలను, మాలలను అమ్మవారి సన్నిధిలో ఉంచి ప్రత్యేకపూజలు చేసారు. అనంతరం మాలధారణ చేసే భక్తులు దీక్షావస్త్రాలను ధరించి ఆలయంలో ప్రదక్షిణలు చేసారు. ఆలయ ప్రాంగణంలోని ప్రత్యేక వేదికపై అమ్మవారిని అలంకరించి పూజల అనంతరం ప్రధానార్చకులు తంగిరాల తొలుత పెంచలరెడ్డికి మాలవేశారు. దాదాపు వెయ్యిమంది స్త్రీ పురుషభక్తులు మాలలు ధరించారు. అనంతరం ప్రసాదాలను అందజేశారు. ముఖ్య అతిథులుగా నెల్లూరు రూరల్ నగర శాసనసభ్యులు ఆనం వివేకానంధరెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ ఆలయ కార్యనిర్వహణాధికారి పాయసం నాగేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

## ఇరుకళలమ్మ ఆదాయం రూ.3.69లక్షలు



హుండీల సొమ్మును లెక్కిస్తున్న ఆలయ సభ్యులు

సింహపురి గ్రామదేవత, మూలాపేట స్వర్ణాలచెరువు వద్ద వేంచేసియున్న శ్రీ ఇరుకళల పరమేశ్వరీ అమ్మవారి దేవస్థానంలో 23వతేదీ హుండీలను లెక్కించగా 3లక్షల 69వేల 541రూపాయల ఆదాయం లభించినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎ.వి. శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది జూన్ నెల 10వ తేదీ నుంచి సెప్టెంబర్ నెల 23వ తేదీ వరకు 104రోజులకుగాను ఈ మొత్తం రాబడిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి పర్యవేక్షకులుగా నెల్లూరు దేవాదాయశాఖ ఇన్స్‌పెక్టర్ పి.శైలేంద్ర కుమార్, దేవస్థానం మాజీఛైర్మెన్ సూరిశెట్టి నరేంద్ర, సభ్యులు పాల్గొన్నట్లు తెలిపారు.

## పర్యావరణ విజేతలకు సిఎంఆర్ బహుమతులు



విజేతలకు బహుమతులందజేస్తున్న ఎమ్మెల్యేలు

కాలుష్య రహిత వినాయక ప్రతిమల పోటీల్లో గెలుపొందిన విజేతలకు నెల్లూరు సిఎంఆర్ షోరూంలో 21వతేదీ నెల్లూరు రూరల్ నగర ఎమ్మెల్యేలు ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డి బహుమతులు అందజేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ రసాయనక పదార్థాలతో వినాయక విగ్రహాలను తయారుచేయడం వల్ల వాతావరణం, నీరు, కలుషితమయ్యే ప్రమాదముందన్నారు. వీటి ద్వారా కలిగే నష్టాలను ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశ్యంతో సిఎంఆర్ షోరూంలో వినాయకచవితిని పురస్కరించుకొని రుద్రాక్షలతో వినాయక విగ్రహాన్ని ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. ప్రథమ బహుమతి టి.నందా, ద్వితీయ బహుమతి ఎన్.సన్విత, తృతీయ బహుమతి ఎం.సుమతి, మరో పదిమందికి కన్సోలేషన్ బహుమతులు అందజేసారు. ఈ కార్యక్రమంలో సిఎంఆర్ షోరూం అధినేత మావూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ ద్విచక్ర వాహన ర్యాలీ

నెల్లూరులో మైపాడుగేటు వద్ద నుంచి ఈనెల 20న రాష్ట్ర విభజన వ్యతిరేకిస్తూ తెలుగుదేశం పార్టీ నెల్లూరు నగరశాఖ భారీ సంఖ్యలో ద్విచక్ర వాహన ర్యాలీని నిర్వహించింది. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, నగర అధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి జెండా ఊపడంతో ప్రారంభమైన బైక్‌ల ర్యాలీ స్టోన్‌హౌస్‌పేట, ఆత్మకూరు బస్టాండ్, గాంధీబొమ్మ, విఆర్ కళాశాల, చిన్నబజారుల మీదుగా నర్తకి సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వరకు సాగింది. ఈ సందర్భంగా బీద రవిచంద్ర మాట్లాడుతూ సమైక్యాంధ్ర కోసం సీమాంధ్రలో ఎగిసిపడుతున్న ఉద్యమానికి కేంద్ర ప్రభుత్వం స్పందన కరువయ్యిందని, సీమాంధ్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు దీనికి బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో మాజీమంత్రి తాళ్ళపాక రమేష్‌రెడ్డి, టీడీపీ నాయకులు కిలారి వెంకట స్వామినాయుడు, ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, వై.వి.సుబ్బరావు, నూనె మల్లికార్జున యాదవ్, శింగంశెట్టి రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## బిజేపి మోర్చా రాష్ట్ర పదవికి మహ్మద్‌బాషా



భారతీయ జనతా పార్టీ మైనార్టీ మోర్చా రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నెల్లూరు వెంకటేశ్వరపురంకు చెందిన ఎస్.కె.మహ్మద్‌బాషాను బిజెపి పార్టీ నియమించింది.

PDF Compressor Free Version



# పని చూపిస్తున్న పోలీసు

సింహపురి సమాచారం



**చాలాకాలం తర్వాత జిల్లాలో పోలీసు వ్యవస్థ పనిచేస్తున్న దాఖలాలు కనిపిస్తున్నాయి. రోడ్ల మీద పోలీసులు కనిపిస్తున్నారు. నగరంలో ఎక్కడికక్కడ తనిఖీలు చేస్తున్నారు. అక్రమాలకు కళ్లెం పడే విధంగా పోలీసు చర్యలు కనిపిస్తున్నాయి.**

చాలాకాలంగా జిల్లాలో పోలీసువ్యవస్థ నిర్వీర్యమవుతూ వచ్చింది. ఎస్పీగా శ్రీనివాసరెడ్డి వున్నప్పుడు పోలీసు పనితీరు ఏ విధంగా వుంటుందో ప్రజలు చూసారు. ఆయనను జిల్లా ప్రజలు ఇప్పటికీ మరచిపోలేదు. ఆ తర్వాత కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి కూడా మెరుగ్గానే పనిచేసారు. ఈయన తర్వాత నుండే పోలీసుశాఖలో నిర్లక్ష్యం అలుముకుంటూ వచ్చింది. ఎస్పీలుగా వచ్చినవాళ్లకు క్రిందిస్థాయి అధికారులపై పట్టు లేకపోవడంతో అన్ని పోలీసుస్టేషన్‌లలో కూడా శాంతిభద్రతల సమస్యలు తెలత్తాయి. ముఖ్యంగా గత ఎస్పీ బి.వి.రమణకుమార్ హయాంలో అయితే పోలీసు పనితీరే ప్రశ్నార్థకంగామారింది. రోజుకో దొంగతనం, వారానికో హత్య అన్నట్లుగా నేరాలు మితిమీరాయి. ఎస్పీగా రమణకుమార్ నేరాలను నియంత్రించడంలో విఫలమయ్యారు. ఆయన 'క్యాప్' మీద చూపించిన శ్రద్ధ శాంతిభద్రతల మీద చూపలేకపోయారు. వ్యక్తిగతంగా మంచివాడు, నిజాయితీ పరుడైనప్పటికి అవేవీ ఆయన పోలీసు పనికి ఉపయోగపడలేదు. తన క్రింద సిబ్బంది చేత పనిచేయించడంలోనూ, పరుగులు పెట్టించడంలోనూ ఆయన విఫలమయ్యారు.

ప్రస్తుత ఎస్పీ రామకృష్ణ మాత్రం తాను పనిచేయడంకంటే కూడా తన సిబ్బంది చేత ఒళ్లు వంచి పనిచేయించడంపైనే ప్రధానంగా దృష్టిసారించారు. డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలకు ఊపిరాడనీయకుండా పని పెడుతున్నారు. రౌండ్‌ది క్లాక్ పోలీసులను రోడ్ల మీద తిప్పుతున్నారు. నేరాలకు ప్రధానకారణం ద్విచక్రవాహనాలే! దొంగలయినా, కిరాతకులైనా నేరాలు చేసాక పారిపోవడానికి వాడేది ద్విచక్రవాహనాలనే! వాటిని దృష్టిలో పెట్టుకునే బైక్ తనిఖీలను ముమ్మరం చేసారు. ప్రతి స్టేషన్ పరిధిలో సిఐలు, ఎస్సైలు తనిఖీలను విస్తృతంగా చేస్తున్నారు. రాత్రిపూట గస్తీలను పెంచారు. ఏ నిమిషంలో చూసినా రోడ్లమీద పోలీసు కనిపిస్తున్నాడు. ఇదే పద్ధతిని కొనసాగిస్తే నేరాలు తగ్గుముఖం పట్టడం ఖాయం.



సమైక్యాంధ్ర ఉద్యమంలో భాగంగా నెల్లూరు రోడ్లపై జరిగిన ఆందోళనల్లో విద్యార్థినులతో కబడ్డీ ఆడుతున్న నెల్లూరు రూరల్ శాసనసభ్యులు ఆనం వివేకానందరెడ్డి

# 'ఆధార్' అన్నింటికి ఆధారం కాదు

నెల్లూరుజిల్లాలో రెండేళ్ల క్రితం ఆధార్‌కార్డుల జారీ ప్రక్రియ మొదలైంది. 29లక్షల మందికి ఆధార్‌కార్డులు ఇవ్వాలన్న లక్ష్యంతో ఆధార్ కేంద్రాలను ప్రారంభించారు. బ్యాంకు ఖాతాలు తెరవడం నుంచి ప్రతి పనికి ఆధార్‌కార్డులను ముడిపెట్టడంతో ఈ కార్డులకు డిమాండ్ పెరిగింది. అంతేగాక ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆధార్ జతచేయాలని నిబంధన పెట్టారు. వివాహాలు రిజిస్ట్రేషన్ నుంచి ప్రతి పనికి ఆధార్ కీలకంగా మారింది. ఎట్టకేలకు 24లక్షలమందిని బయోమెట్రిక్ ద్వారా ఎన్‌రోల్ చేసారు. ఎన్‌రోల్ చేసినా సాంకేతిక కారణాలతో కొన్ని కార్డులు జనరేట్ కాక పోవడంతో గందరగోళం ఏర్పడింది. నెల్లూరులో ప్రస్తుతం 12చోట్ల ఆధార్‌కేంద్రాలను నెలకొల్పారు. ఈ ప్రక్రియ ఇప్పటికీ కొనసాగుతూనే వుంది. కేంద్రప్రభుత్వం నగదుబదిలీ కార్యక్రమాన్ని అమలుచేస్తూ వంటగ్యాస్‌కు అనుసంధానం చేసింది. అంతేకాదు ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్, విద్యుత్, తాగునీటి కనెక్షన్లు, వివాహాల, భూముల రిజిస్ట్రేషన్ వంటి కార్యక్రమాలకు ఆధార్ తప్పనిసరి. ఆధార్ లేకపోతే కార్యాలయాల్లో అడుగుపెట్టని పరిస్థితి ఏర్పడింది.

అయితే ఆధార్‌తోనే అన్ని కార్యక్రమాలు అని ప్రభుత్వం ప్రకటించడంతో దీనిపై కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

## సుప్రీం తీర్పుతో ప్రజల ఊరట

దేశ అత్యున్నత న్యాయస్థానం సోమవారం తన తీర్పులో ఆధార్ తప్పనిసరి కాదని, అది వ్యక్తి ఇష్టపూర్వకమేనంటూ, ఇది పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించడమేనని దేశవ్యాప్తంగా ఆధార్‌కార్డుల పంపిణీ ఇంకా పూర్తి చేయకుండా అటువంటి ఉత్తర్వులు రాజ్యాంగంలోని 14, 21అధికరణల్లో పొందుపరిచిన జీవించేహక్కు, సమానత్వ హక్కును హరించివేస్తాయని వెల్లడించింది. సుప్రీం తీర్పుతో ప్రజలు ఊరట చెందారు. ఎవరికి అవసరమైతే వారే ఆధార్‌కార్డును తీసుకునే వెసలుబాటును సుప్రీంకోర్టు కల్పించింది.

## రండి బాబు... రండి... అర్జీలు తెండి

సమైక్యాంధ్ర ఉద్యమంతో జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌డే (ప్రజావిజ్ఞప్తులదినం) సోమవారం వెలవెలపోయింది. అర్జీదారుల కోసం జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ వేచిచూసి ఎవరూ రాకపోవడంతో తన ఛాంబర్‌కు వెళ్లిపోయారు. అదనపు కలెక్టర్ బి.లక్ష్మీకాంతం తక్కువసంఖ్యలో అర్జీలు వస్తుండడంతో వాటిని స్వీకరించారు.

# ప్రకాష్ భక్షీ సిఫార్సులను సహించం

**- డీసీసీబీ ఛైర్మెన్ మెట్టుకూరు**



సహకార వ్యవస్థను నిర్వీర్యం చేసేలావున్న ప్రకాష్‌భక్షీ సిఫార్సులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని జిల్లా కేంద్ర సహకారబ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 22వ తేదీన నెల్లూరులోని బ్యాంకు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులను కేవలం బిజినెస్ కరస్పాండెంట్లుగా మార్చేలా భక్షీ సిఫార్సులు వున్నాయన్నారు. ఆస్తులను అప్పులను డీసీసీబీలో విలీనం చేయాలని చెప్పడంతో సహకార బ్యాంకులు మూతపడే ప్రమాదముందన్నారు. రైతులకు సేవచేయాలనే ఆశయంతో బ్యాంక్ ఛైర్మెన్‌గా ఎన్నికయ్యానని, ఇలాంటి సిఫార్సులు తమ లక్ష్యాన్ని దెబ్బతీస్తాయని ఆయన ఆవేదన చెందారు. 2012-13 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఖరీఫ్ పంటకు 130కోట్ల పంటఋణాలను రైతులకు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటి వరకు 110కోట్లను అందజేసామన్నారు. దీర్ఘకాలిక ఋణాలకు సంబంధించి మార్చిలోగా 12కోట్ల ఋణాలను అందజేస్తామన్నారు. బ్యాంకు పరిధిలో చెరుకు, పొగాకు రైతులకు అందించే ఋణ పరిమితిని 3లక్షల రూపాయల వరకు పెంచుతున్నట్లు చెప్పారు. జిల్లాలోని అన్నిబ్యాంకు శాఖలలో కంప్యూటరీకరణ పూర్తయ్యిందని, త్వరలో అల్లూరు, రాపూరు, నెల్లూరు రామ్మూర్తినగర్‌లలో కొత్తశాఖలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

# రాష్ట్రానికి పండుగరోజు



కార్యకర్తలతో ఆనందం పంచుకుంటున్న పాండురంగారెడ్డి

ప్రజల మనస్సులలో చెరగని ముద్ర వేసుకొన్న ప్రజానాయకుడు డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి ఆశయాలను తిరిగి అమలుచేయడానికి జైలు నుండి జనంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతూ, నేడు నిజంగా తెలుగు వారికి పండుగరోజని, ధర్మం-న్యాయం ఆయన వైపు ఉన్నాయని అనడానికి ఇదే నిదర్శనమని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు జిల్లా నాయకులు సూరి పాండురంగారెడ్డి అన్నారు. భవిష్యత్‌లో వై.యస్.జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో తెలుగువారందరూ ఏకతాటిపై నడిచి సమైక్యాంధ్రను సాధించుకుంటామని, తెలుగువారందరూ జగన్ ముఖ్యమంత్రి కావాలని ఎదురుచూస్తున్నరోజు ఎంతో దూరంలో లేదని ఆయన అన్నారు.

484రోజుల తరువాత జగన్మోహన్‌రెడ్డి జైలు నుండి విడుదలైన సందర్భంగా మంగళవారం నెల్లూరు, మినీబైపాస్‌రోడ్డులో భారీఎత్తున బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వై.యస్ఆర్ పార్టీ నాయకులు మురళీకృష్ణ, రామ్ కుమార్, సిద్ధయ్య, సునీల్, ప్రశాంత్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, శ్రీమతి ధనుజారెడ్డి, పీతాంబరం భాస్కర్, రాజాశేఖర్, వేల్పుల సాగర్, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సమైక్యాంధ్ర దళిత పోరాట సమితి అవగాహన సదస్సులు



సమితి నేతలకు స్వాగతం పలుకుతున్న మహిళలు

నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని వైయస్సార్ కాంగ్రెస్ కార్యాలయంలో ఈనెల 21న సమైక్యాంధ్ర దళిత పోరాట సమితి ఆధ్వర్యంలో చర్చా కార్యక్రమం జరిగింది.

సమితి అధ్యక్షుడు మందా బాబ్జీ ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగితే దళితులు తీవ్రంగా నష్టపోతారని, దళిత విద్యార్థులకు అందవలసిన స్కాలర్ షిప్‌లు సకాలంలో అందవని, రిజర్వేషన్ మొత్తం హరించుకుపోతుందని, దళితులకు రావలసిన ఉద్యోగాలు ఇరవై సంవత్సరాల వరకూ రావని పేర్కొన్నారు. ఈనెల 23 నుంచి వారం రోజులపాటు దళితవాడలలో దళితులను చైతన్య పరచడానికి అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సమైక్యాంధ్ర దళిత పోరాట సమితి కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడు మందా బాబ్జీ, అధికార ప్రతినిధి అరవ ఆనంద్‌బాబు, ఉపాధ్యక్షులు పాదర్తి సుధాకర్, తీపలపూడి భాస్కర్‌రావు, దొరస్వామి నిత్యానంద్‌లు, ప్రధాన కార్యదర్శులు సందిపాటి శ్యామ్, మందా పెద్దబాబు, మల్లెల నటరాజ్‌లు, కార్యదర్శులు రాచపూడి ఆనంద్, పంట్రంగి అజయ్, బద్దిపూడి మణి, అశోక్, గంటా డేవిడ్‌లు, సభ్యులు తాటిపర్తి మహేంద్ర, గుంటూరు దేవదానం, పల్లాల ప్రసన్నకుమార్, పొట్లూరు రమణయ్య, తాటిపర్తి ఏడుకొండలుగా పేర్కొన్నారు.

23వతేదీన ఈ సమైక్యాంధ్ర దళిత పోరాట సమితి చేపట్టిన గ్రామగ్రామాన దళితవాడలో అవగాహన సదస్సు కార్యక్రమం నెల్లూరు మూలాపేటలోని అరుంధతీయవాడలో ప్రారంభించారు. డా॥ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి స్థానిక పెద్దలు సమైక్యాంధ్ర జెండాను ఊపి ర్యాలీని ప్రారంభించారు. సమితి సభ్యులు కరపత్రాలను పంచి పెడుతూ అక్కడి నుండి పొట్టేపాళెం, గుడితూము, కొండ్లపూడి, దేవరపాలెం, ములుమూడి వరకు హరిజనవాడలు, అరుంధతీయవాడలలో ప్రసంగిస్తూ సదస్సులు నిర్వహించారు. కొండ్లపూడి గ్రామంలో వైయస్సార్సీపీకి చెందిన సర్పంచ్ నర్రా నరసమ్మ సదస్సులో పాల్గొని సంఘీభావం తెలిపింది.

కార్యక్రమంలో సమితి నేతలు మందా పెద్దబాబు, అరవ ఆనంద్ బాబు, డి.టి. సత్యానంద్, ఎం.నటరాజ్, పంట్రంగి అజయ్, బద్దిపూడి మణి, రాచపూడి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
• సరికొత్త ప్రపంచస్థాయి మోడల్స్
• ఇంపోర్టెడ్ & ఇండియా ఫర్నిచర్
ఫైనాన్స్ సదుపాయము, ఆదివారం షాపు గలదు.

PDF Compressor Free Version



## కదంబం

### కబేళాకు వేళాడే...

వేణు సంకోజు,
నల్గొండ, 99484 19881

కనిపించేదల్లా కవితేనా
స్పర్శలేని అనుభవసారాన్ని
ఎవరికోసం పంచుకోను...?

దర్శించడమంటే చూపేనా?
ఆపాదమస్తకం ఆర్ద్రతలో తడిసి
తన్మయం చెందక వ్యర్థంకాను...?

స్పందనంటే అద్దం నిలువూ
కొలమానాలు కావుకదా
ఊహాత్మక ఎవరెస్టులనధిగమించిన
డొల్లతృప్తులు పొడుగాను...!

ఒక్క రాక్షస గుండెనైనా పిండలేనప్పుడు
ఒక్క న్యాయసమ్మతమైన ధిక్కారాన్నైనా
వినిపించనప్పుడు
ఒక్క మార్పును సంకేతించనప్పుడు
ఒక శుభాన్నైనా కోరనప్పుడు
కవితా అది?
కబేళాకు వేళాడే
ఎండిన మేకం పిక్కగాను...?

# విశ్వగురువు శ్రీ సాయి



ఉపన్యసిస్తున్న శ్రీ సాయి విశ్వచైతన్య

కలియుగంలో కలి మాయను ఎదుర్కోవాలంటే గురువును ఆశ్రయించాలని, గురువును త్రికరణశుద్ధిగా సేవించాలని, గురువు యొక్క ఆదేశాలను పాటించాలని స్వామి శ్రీ సాయి విశ్వ చైతన్య ప్రవచించారు.

శ్రీ షిరిడిసాయి తత్వప్రచార సమితి నెల్లూరుశాఖ ఆధ్వ ర్యంలో నెల్లూరు టౌన్‌హాల్లో ఈనెల 21వతేదీ నుండి నిర్వహి స్తున్న 204వ శ్రీ షిరిడిసాయి గీతాజ్ఞాన యజ్ఞ ప్రవచనాల్లో శ్రీ స్వామీజీ ప్రవచించారు. సాయిభక్తులు గురువుల కోసం వెతుక్కో నవసరం లేదని, ఎవరైతే బాబాను గురువుగా స్వీకరిస్తారో బాబావారిని ఉన్నత శిఖరాలను అధిరోహింపచేస్తాడని తెలిపారు. భక్తులను రక్షించుటకు కలిమాయ నుండి తప్పించుటకు ఆదిపరాశక్తి పురుష అంశంతో, సాయిబాబా రూపంలో అవతరించిందని, ఎవరైతే బాబాను పూజిస్తారో వారు ఆ జగన్మాతను పూజించినట్లని స్వామిజీ తెలిపారు. తొమ్మిది రోజుల పాటు జరిగే నవాహంలో 26వతేదీ మహానక్షత్ర హారతి, 27వతేది బాబా వారికి పూలపాట, 28వతేది శనివారం జాగృతి కూచిపూడి నృత్యప్రదర్శన జరుగు తుందని, 29వ తేది బాబా వారికి వైభవంగా సాయిశక్తి పూజ జరుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కన్వీనర్ చీతిరాల రామారావు సురేష్‌బాబు, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## పుస్తకావిష్కరణ

శ్రీ పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో ఈనెల 22న నెల్లూరు దర్గామిట్ట సరస్వతినగర్‌లోని ఐఎంఏ హాల్లో అష్టావధానం సమస్యా పూరణం పుస్తకావిష్కరణ సభ జరిగింది. ప్రయాగ కృష్ణమూర్తి రచించిన ఈ పుస్తకాన్ని పద్య కళాపరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్ ఆవిష్కరించారు. బెగొర అవార్డు కమిటీ కార్యదర్శి బి.వి.నరసింహం, నెరసం అధ్యక్షుడు ఎ.జయప్రకాష్, కార్యదర్శి మాటేటి రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సీమాంధ్ర నేతలకు దిగ్విజయ్ రాచమర్యాదలు

## శ్రీమాన్ గల్పిక

అది శాడిస్టులీడర్లకు పేరెన్నికగన్న ఢిల్లీ మహానగరం. ఆంధ్రా మైకేల్‌జాక్సన్ మాగుంట శ్రీనివాసులురెడ్డి నివాసం. కేంద్రమంత్రులు చిరంజీవి, పల్లంరాజు, పురంధరేశ్వరి, కిల్లి కృపా రాణి, కావూరి సాంబశివరావు, పనబాక లక్ష్మి, కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, జె.డి.శీలం, ఎంపీలు లగడపాటి రాజగోపాల్, హర్షకుమార్, టి.సుబ్బ రామిరెడ్డి, సాయిప్రతాప్, కనుమూరి బాపిరాజు వంటివారు సమావేశమయ్యారు. రాష్ట్ర విభజనపై తామేం నిర్ణయం తీసుకోవాలన్న దానిపై వాళ్లు అక్కడ మీటింగ్ పెట్టారు. సమా వేశాన్ని ప్రార్థనాగీతంతో ప్రారంభిద్దామని చెప్పి మాగుంట శ్రీనివాసులురెడ్డి... 'వాతాపిగణపతిం భజే' అనే శ్లోకం పాడాడు. వెంటనే టి.సుబ్బరామి రెడ్డి లేచి... "ఓం నమశ్శివాయ" అంటూ భక్తి గీతం పాడాడు. పనబాక లక్ష్మి "అమ్మంటే ప్రేమకు రూపం... సోనియమ్మంటే పదవికి రూపం" అంటూ సొంత ప్రైవేట్‌సాంగ్ పాడింది. అప్పుడు లగడపాటి రాజగోపాల్ జోక్యం చేసుకుని... మనం ఇక్కడ సంగీతకచేరి ఏర్పాటు చేయలేదు... రేపు తెలంగాణ ఏర్పడ్డాక తేలిగ్గా పాటలు పాడుకోవడానికి మనకు కావాల్సినంత సమయం దొరుకుతుంది... ఇప్పుడు మనం సొంత నియోజకవర్గాలకు ఎలా వెళ్లగలమో ఆలోచించండి... రాష్ట్ర విభజనను అడ్డుకుంటేనే మనల్ని జనం ఊర్లకు రానిచ్చేటట్లున్నారు. లేకుంటే మన కేరాఫ్ అడ్రస్ ఢిల్లీనే అని చెప్పాడు. అప్పుడు చిరంజీవి... డోన్ట్‌వర్రీ రాజగోపాల్... ఇప్పుడే మనం కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దలందరినీ కలుద్దాం... రాష్ట్రాన్ని సమైక్యంగా వుంచమని బ్రతిమలాడుదాం... లేదంటే రాజీనామాలు చేస్తామని బెదిరిద్దాం అని చెప్పాడు. అందరూ అందుకు సమ్మతించారు. దాంతో అందరూ కలిసి ముందుగా మూర్ఖత్వానికి కేరాఫ్ అడ్రస్ అయిన దిగ్విజయ్‌సింగ్ ఇంటికెళ్లారు. అక్కడ ఆవరణలో వారికి కొన్ని కుందేళ్లు కనిపించాయి. వాటిని చూసి సీమాంధ్ర కేంద్రమంత్రులకు, ఎంపీలకు భలే ఆశ్చర్యమేసింది. కారణం వాటన్నింటికి మూడేసి కాళ్లే వున్నాయి. కావూరి సాంబ శివరావు అక్కడున్న పనిమనిషిని పిలిచి... ఇదేంటి! ఈ కుందేళ్లన్నింటికి మూడుకాళ్లే వున్నాయని అడిగాడు. దానికతను... మా సార్ వేటకు వెళ్లి ఏ కుందేలును పట్టుకొచ్చినా దానికి మూడు కాళ్లే వుంటాయి. మూడు కాళ్ల కుందేళ్లంటే మా సార్‌కు భలే ఇష్టమని చెప్పాడు. లగడపాటికి అప్పుడర్థమైంది... దిగ్విజయ్‌సింగ్ ఎప్పుడు కూడా తాను పట్టిన కుందేలుకు మూడేకాళ్లు అన్నట్లు ఎందుకు వ్యవహరిస్తాడనేది. చిరంజీవి వుండి అక్కడి ప్యూన్‌తో... మీ సార్‌కు మెగాస్టార్ చిరంజీవి వచ్చాడని చెప్పు... అని పంపించాడు. వెంటనే చిరంజీవి ఊహాలోకంలోకి వెళ్లాడు...

★★★★★

చిరంజీవి వచ్చాడని చెప్పగానే దిగ్విజయ్ సింగ్ లుంగీమీద అలాగే బయటకు పరుగెత్తాడు. చిరంజీవిని అమాంతం కౌగిలించుకుని చిరు గారు... మీరేంటి బయట నా కోసం వెయిట్ చేయడం... మీరు ఒక్క ఫోన్ చేస్తే నేనే మీవద్దకు వచ్చేవాణ్ణి కదా... అయినా మీ రాకతో మా ఇల్లు పావనమైపోయింది... ఇంతకీ ఏం తీసు కుంటారు... టీ, కాఫీ, జ్యూస్... అని అన్నాడు. దానికి చిరు... మీరు ఇస్తానంటే సమైక్యాంధ్ర ప్రదేశ్‌ను తీసుకెళ్లాలని వుందన్నాడు. దానికేం భాగ్యం చిరుగారు... మీరు ఎలా కోరితే అలా... రాష్ట్రాన్ని విభజించమంటే విభజిస్తాం... సమైక్యంగా వుంచమంటే ఉంచుతామన్నాడు దిగ్విజయ్‌సింగ్. చూసారా నా పవర్ అన్నట్లు చిరంజీవి మిగతా వారివైపు చూసాడు.

★★★★★

అప్పుడే... "ఏం అంతా ఒకేసారి ఇలా తగలబడ్డారు" అనే మాట వినబడింది. ఆ మాటతో చిరంజీవి ఊహాలోకం నుండి బయట కొచ్చాడు. ఎదురుగాచూస్తే దిగ్విజయ్‌సింగ్ వున్నాడు. కనీస మర్యాద కూడా లేకుండా ఆయన మాట్లాడిన మాటకు చిరంజీవి షాకయ్యాడు. కొద్దిసేపటికి తేరుకుని... సార్, నేను చిరంజీవిని అని పరిచయం చేసుకోబోయాడు. నువ్వు చిరంజీవి అయితే నాకేం, పరాన్నజీవి అయితే నాకేం... ఇంతకీ మీరంతా కలిసి ఎందుకు తగలబడ్డారో చెప్పిచావండి అని చాలా కటువుగా అడిగాడు. కావూరి సాంబశివరావు వుండి... సార్, మీరు చేసిన విభజన ప్రకటన వల్ల మేం మా నియోజకవర్గాలలో అడుగుపెట్టలేక పోతున్నాం... జనాలు చేతికి ఏది దొరికితే అది తీసుకుని కొడుతున్నారు. విభజనను కొంత కాలమన్నా వాయిదావేయండి సార్ అని ప్రాధేయపడసాగాడు. దానికి దిగ్విజయ్ భగ్గున మండిపడ్డాడు... దీని గురించి మాట్లాడానికయితే మీరు ఇక్కడిదాకా రాబట్టేదు... నాటైం దండగ.. ఈ టైంలో నా మూడుకాళ్ల కుందేళ్లకు మేత తినిపించుకుంటాను. మేడమ్ ఒక నిర్ణయం తీసుకున్నారంటే అది ఇటలీ అయినా, ఇండియా అయినా అమలు జరగాల్సిందే! మీ బోడిసలహా లేవన్నా వుంటే హైదరాబాద్ మీద ఇవ్వండి... మాకు వీలైతే పరిశీలిస్తాం... అని అన్నాడు. దానికి ఎంపీ అనంత వెంకట్రామిరెడ్డి వుండి... మీరు రాష్ట్రాన్ని సమైక్యంగా వుంచుతున్నట్లు ప్రకటన వేయకపోతే రాజీనామాలు వేయడం తప్ప మాకు మరో గత్యంతరం లేదని అన్నాడు. ఆ మాటకు దిగ్విజయ్... ఏదీ రాజీనామా లెటర్‌లు తెచ్చారా, తెచ్చుంటే ఇటివ్వండి... వెంటనే స్పీకర్‌కు పంపించి నేనే ఆమోదింప జేస్తా... ఒకవేళ లేకుంటే తెల్లకాగితాలు నేనే ఇస్తా... ఇక్కడే రాజీనామాలు చేసి నాకివ్వండి... మీ బెదిరింపులు మాటల్లో కాదు... చేతల్లో చూపండి... ఇంకోసారి రాష్ట్రాన్ని సమైక్యంగా వుంచండంటూ నా గడప ఎక్కొద్దు... అలా ఎక్కారంటే మీ మీదకు కుక్కల్ని వదులుతా అని హెచ్చరించాడు. మీ మాటలతోనే అదిరి ఛస్తున్నాం. ఇక కుక్కలెందుకులే సార్ అని సీమాంధ్రనేతలు మనసులో గొణుక్కున్నారు. ఇక అక్కడ ఎక్కువసేపు వుంటే దిగ్విజయ్‌సింగ్ అన్నంత పని చేస్తాడని భయపడ్డ సీమాంధ్రనేతలు బయటకొచ్చారు. వీళ్లు బయటకు రాగానే మీడియావాళ్లు లోపలేం జరిగిందని అడిగారు. కడుపు చించుకుంటే కాళ్లమీద పడుతుందని భావించిన సీమాంధ్రనేతలు ఒకరిచెవిలో ఒకరు గుసగుసలాడుకుని... అందరి తరపున ఒకరు మాట్లాడాలని నిర్ణయించుకుని అందుకు చిరంజీవిని ఎంచుకున్నారు. చిరంజీవి మీడియాతో మాట్లాడుతూ... ఈరోజు దిగ్విజయ్ సింగ్ గారిని కలవడం జరిగింది. ఆయన మమ్మల్ని చూడగానే ఆనందంతో పరవశించి పోయారు. నన్ను అమాంతం కౌగిలించుకున్నారు. కాఫీ, జ్యూస్‌లు అందించారు. రాష్ట్ర విభజనపై తప్పుచేసారని నేను అనగానే ఆయన కూడా తప్పుచేసామనే భావనతో మౌనం దాల్చారు. ఇలా చేయాల్సిందికాదని బాధపడ్డారు. రాష్ట్రంలో ఏకాభిప్రాయం వచ్చేదాకా తెలంగాణ నోట్ తెచ్చే దిలేదన్నారు. మా ప్రయత్నాలు ఫలించినట్లే... రాష్ట్ర విభజనకు తాత్కాలికంగా బ్రేకుపడ్డట్లే... సీమాంధ్ర ప్రజలు శాంతించి బంద్‌లు మాని సినిమాలకు, షికార్లకు పోవాలని విజ్ఞప్తి చేస్తు న్నానని చెప్పాడు.

అప్పుడే దిగ్విజయ్‌సింగ్ బయటకొచ్చాడు. మీడియా వాళ్లు ఆయన నోటివద్ద మైకులు పెట్టి... తెలంగాణ ప్రక్రియ ఆగినట్లేనా? అని అడిగారు. దానికాయన... ఏంటీ ఆగేది... ఈరోజు తెలం గాణ నోట్ పెట్టేస్తున్నాం... రేపోమాపో విభజన కూడా అయిపోతుందని చెప్పేసి వెళ్లిపోయాడు. అది విని సీమాంధ్ర కేంద్రమంత్రులు, ఎంపీలు ఈ దిగ్విజయ్‌సింగ్ మమ్మల్ని ఊర్లకు పోనిచ్చే టట్లు లేదు... ఇక మేం ఢిల్లీలో వుండిపో వాల్సిందేనా? అని మనసులో బాధపడసాగారు.

★★★★★

# విద్యార్థులకు జిల్లా పర్యాటకశాఖ పోటీలు



పచ్చజెండా ఊపి విహారయాత్రను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్

నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని పురావస్తుశాఖ మ్యూజియంలో ఈనెల 21న విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం అంశాలపై జిల్లా పర్యాటకశాఖ పోటీలు జరిపింది. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్క రించుకొని జిల్లా పర్యాటకశాఖ అధికారి ఎం.నాగభూషణం నేతృత్వంలో ఈ పోటీలు జరిగాయి. దాదాపు 300మంది విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ నెల 27న నెల్లూరు దర్గామిట్టలోని హరిత హెరిటేజ్ హోటల్లో జరిగే కార్యక్రమంలో విజేతలకు జిల్లా కలెక్టర్ శ్రీకాంత్ బహుమతులు అందిస్తారని జిల్లా పర్యాటకశాఖ అధికారి నాగభూషణం తెలిపారు.

### టూర్‌కు విద్యార్థులు

ప్రపంచ పర్యాటక దినోత్సవం (సెప్టెంబర్ 27)న పురస్కరించుకొని ఈనెల 22న ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల విద్యార్థులకు జిల్లా పర్యాటకశాఖ ఏర్పాటుచేసిన జిల్లా పర్యటన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ శ్రీకాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థులు ఒక్కరోజు పర్యటనగా బస్సులో జిల్లాలోని పర్యాటక ప్రాంతాలైన కండలేరు, పెంచలకోన, సోమశిల ప్రాంతాలను సందర్శిస్తారని అన్నారు. జిల్లాలో చారిత్రక ప్రదేశాలు ప్రఖ్యాత దేవాలయాలు ఎన్నో వున్నాయని కళాశాలల విద్యార్థులు వీలునుబట్టి వాటిని కూడా సందర్శించి అవగాహన ఏర్పరచు కోవాలన్నారు. జిల్లా పర్యాటక అధికారి యం.నాగభూషణం నేతృత్వంలో కార్యక్రమం జరిగింది.

## మేషం

అశ్విని, భరణి, కృత్తిక 1 పాదము

ఉద్యోగులకు సహచరుల సహకారం, అధికారుల అండదండలు లభిస్తాయి. వాహనాలు యంత్రాలతో పనులు జరిపేటప్పుడు జాగ్రత్త అవసరం. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. షేర్ల, పెట్టుబడి రంగాలలో కొద్ది లాభాలుంటాయి. వర్తకులతో ఇబ్బందులు పడతారు. వస్తు వాహన కొనుగోలు చేస్తారు. ఉద్యోగార్థులకు అనుకూలత తక్కువ. ప్రయాణాలలో ఇబ్బందిపడటం జరుగవచ్చును.

## వృషభం

కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర్ష1, 2పాదాలు

బంధుముఖ్యుల అనారోగ్య వార్తలు వింటారు. పెట్టుబడి రంగాలలో స్వల్ప లాభాలుంటాయి. ముఖ్యమైన వ్యవహారాలను మీరే సమీక్షించుకొనడం మంచిది. చెల్లింపులు జరుపుతారు. ఆర్థిక లావాదేవీలు, వాణిజ్య ఒప్పందాలు అనుకున్న విధంగా సాగవు. వృత్తి జీవనం కలవారికి వ్యాపకం ఆదాయం బాగుంటుంది. విద్యా ప్రగతి బాగుంటుంది. ఆరోగ్యం సరిగా ఉండదు.

## మిథునం

మృగశిర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

అధికార, అనధికార ప్రయాణాలుంటాయి. చిరకాల మిత్రులను కలుసుకోవడం, ప్రముఖులతో పరిచయాలను పెంచుకొనడం జరుగుతుంది. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి, ఆదాయం పెరుగుదల ఉంటుంది. అనుకున్న పనుల సక్రమంగా జరుగుతున్నా టెన్షన్ పడుతుంటారు. ప్రభుత్వ అనుమతులు, ఋణాలు లభించగలవు. పెట్టుబడి రంగాలలో లాభాలుంటాయి.

## కర్కాటకం

పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

శుభకార్య ప్రయత్నం సానుకూలమగు సూచనలు న్నవి. కోర్టు వ్యవహారాలు, స్థిరాస్తుల లావాదేవీలు అను కూలంకాగలవు. ఉద్యోగులలో అసంతృప్తి ఉండినా పని సామర్థ్యమును చూపుతారు. అనుకున్న పనులు టెన్షన్ పెట్టినా సవ్యంగానే సాగుతాయి. అవసరాలకు అయిన వారు సహాయ పడతారు. నిరుద్యోగులకు అవకాశాలు దొరకే సమయమిది. ఆరోగ్యం బాగుంటుంది.

## సింహం

మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

కుటుంబంలో ఒకటి రెండు ముఖ్య విషయాలపై అనుకూలత ఉండదు. వర్తకులతో కూడిన పనులందు యజమానులకు వర్తకుల వల్ల ఇబ్బందులుంటాయి. ఊహించని అదనపు ఖర్చులకు సిద్ధపడవలసి రావచ్చును. అయినా ఆర్థిక ఇబ్బందులుండవు. వృత్తి వ్యాపారాలలో ఆదాయము వ్యాపకము బాగుంటుంది. పెట్టుబడి, స్టాక్ రంగాలలో లాభాలుంటాయి.

## కన్య

ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

అవసరాలకు ధనం సర్దుబాటు అవుతూ పనులు జరుగుతాయి. ఆకస్మిక ప్రయాణాలుంటాయి. నేత్రాలు, శిరస్సు, కంఠర సరాల సంబంధిత బాధలుంటాయి. వివాదాస్పదమైన మాటలు, సరదాలతో ఇబ్బందులు పడ తారు. అయినా సమర్థవంతంగా సమస్యల నుండి బయట పడటం, పట్టుదలతో అనుకున్న పనులు సాధి ంచడం జరుగుతుంది. విద్యాప్రగతి బాగుంటుంది.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 27.09.2013 నుండి
తేది. 03.10.2013 వరకు

ఈ వారం మిధున కర్కాటక సింహరాశిలో చంద్రుడు. వృషభంలో కేతువు, మిధునంలో గురువు. కర్కాటకంలో కుజుడు, రవి కన్యలో. శుక్ర బుధ శని రాహువులు తులలో సంచరిస్తారు.

### పంచాంగము:

27 తేది నుండి మహాలయ మధ్యాష్టమి.
2తేది గాంధీ జయంతి.

### ముహూర్తములు

ముహూర్తములు లేవు.

### భాద్రపదమాస కృష్ణ పక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 27 | శుక్ర | అష్టమి | రా॥గం.9.20వ॥ |
| తేది. 28 | శని | నవమి | రా॥గం. 11.25వ॥ |
| తేది. 29 | ఆది | దశమి | రా॥గం.1.28వ॥ |
| తేది. 30 | సోమ | ఏకాదశి | రా॥గం. 3.17వ॥ |
| తేది. 01 | మంగళ | ద్వాదశి | రా॥గం. 4.44వ॥ |
| తేది. 02 | బుధ | త్రయోదశి | రా॥గం.5.49వ॥ |
| తేది. 03 | గురు | చతుర్దశి | పూర్తిగా |

## తుల

చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

కుటుంబ పరిస్థితులు చికాకులు కలిగించవచ్చును. సాక్ట్ మార్కెట్ పెట్టుబడి రంగాలలో స్వల్ప లాభాలుం టాయి. మంచి అవకాశాలు చేజారిపోవచ్చును. వారం మధ్యలో అనుకోని అదనపుఖర్చు పైనబడుతుంది. అను కున్న పనులు శ్రమ పడినా జరుగకపోవచ్చును. ఆత్మీ యుల వల్ల సమస్య ఒకటి రావచ్చును. అధికార వర్గంతో యజమానులతో జాగ్రత్తగా మెలగాలి.

## వృశ్చికం

విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

కుటుంబ సభ్యులతో మంచి సఖ్యత, స్థిరాస్తులు, యం త్రాలు వాహనాలు వంటివి కొనే ప్రయత్నాలు, దూర ప్రాంత, విదేశ ప్రయాణాలు నిర్ణయం కాగలవు. శ్రమకు దీటుగా వృత్తి వ్యాపారాలలో రాబడి ఉండదు. పైగా ఆర్థికా వకాశాలు చేజారిపోవచ్చును. ప్రభుత్వం నుండి అనుమ తులు, బ్యాంకు ఋణాలలో ఆలస్యం జరుగుతుంది. వివాహ ప్రయత్నాలలో ఆలస్యముంటుంది.

## ధనుస్సు

మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఆదాయము తృప్తికరం. శుభకార్యాల కొరకు గాని, దైవ సేవా కార్యముల కొరకు ప్రయాణాలుంటాయి. ఉద్యోగులకు పనిభారం పెరుగుతుంది. అధికారులవత్తిడి ఉంటుంది. వృత్తి జీవనం కలిగినవారికి మంచి వ్యాప కం, ఆదాయం ఉంటుంది. వ్యాపార రంగంలో అవకా శాలు, పెట్టుబడికి ఆహ్వానాలు లభిస్తాయి. అనుకున్న పనులు సవ్యంగా జరుగుతున్నా టెన్షన్ పడుతుంటారు.

## మకరం

ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

కుటుంబసౌఖ్యము బాగుండి, బంధువర్గంతో రాక పోకలుంటాయి. సోదరవర్గానికి అభివృద్ధి ఉంటుంది. శుభకార్య ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతాయి. వృత్తి, ఉద్యోగ రంగాల వారికి ప్రాబల్యం బాగుండి ఆదాయము బాగుండి, పనిభారము పెరుగుతుంది. ఆస్థి వ్యవ హారాలు, కోర్టు వ్యవహారాలలో అనుకూలత ఉంటుంది. సాంస్కృతిక సేవా కార్యములలో పాల్గొంటారు.

## కుంభం

ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

నిరుద్యోగులకు వచ్చిన అవకాశాలు ఉపయోగించు కొనడం మంచిది, స్థిరాస్తులు ఏర్పరచుకొనే ప్రయత్నాలు చేస్తారు. ఋణ వ్యవహారాలు అనుకూలం కాగలవు. ఆత్మీ యులతో కలసి వేడుకలు, ముఖ్య కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపార రంగాలలో విస్తరణ, మంచి అభి వృద్ధి ఆదాయముంటుంది. ప్రముఖులతో వ్యాపకాలు పరిచయాలు పెరుగుతాయి.

## మీనం

పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఉద్యోగులకు పనిభారం పెరగడం, స్థానమార్పు ప్రయత్నాలు జరుగుతాయి. బాకీల వసూళ్లలో శ్రమ పడతారు. ఆశించిన విధంగా పనులు నిదానంగా సాగు తాయి. వ్యాపార రంగాల లోను, ఆస్తి వ్యవహారాలలోను బంధువర్గం వల్ల ఆటంకాలు రావచ్చును. స్టాక్‌మార్కెట్ల పెట్టుబడి రంగాలు ఆశాజనకంగా ఉండవు. దూర ప్రయాణాలు చేస్తారు.

# హౌరాకి తప్పిన ముప్పు

## రైలు చక్రాల క్రింద నలిగిన మూగజీవాలు



కన్యాకుమారి నుంచి హౌరా వెళ్లే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలుకు ఆది వారం తెల్లవారుజామున ఘోరప్ర మాదం తప్పింది. నెల్లూరుజిల్లా కావలి - శ్రీవెంకటేశ్వరపాళెం రైల్వేస్టేషన్ల మధ్య తెల్లవారుజామున పట్టాలు దాటుతున్న ఆవులను ఢీకొట్టడంతో రైలు భారీ కుదుపుకు గురై పెద్దశబ్దంతో ఇంజన్‌వెనుక వుండే అండర్‌గార్డు, వికలాంగుల బోగీ పట్టాలు తప్పింది. అదృష్టవశాత్తు ప్రయాణీకులందరూ సురక్షితంగా బయటపడ్డారు. ఇంజన్, వికలాంగుల బోగీల కింద 8ఆవుల కళేబరాలు ఇరుక్కుపోయి ముందుకు ఈడ్చుకు పోవడంతో రైలు పట్టాలు సైతం స్వల్పంగా దెబ్బతిన్నాయి. ముందుగానే ఆవులను గమనించి ప్రమాదాన్ని పసిగట్టిన డ్రైవర్లు చాకచక్యంగా రైలు వేగాన్ని అదుపుచేయడంతో ఘోరప్రమాదం తప్పింది. కారుచీకటిలో నిద్రమత్తులో ఏం జరిగిందో తెలియక ప్రయాణీకులు ఊపిరిబిగపట్టారు. పట్టాలుతప్పిన బోగీలోని ప్రయాణీకులు సురక్షితంగా ఉండడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న బిట్రగుంట టీఎక్సర్, మెడికల్ రిలీఫ్‌వ్యాన్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పట్టాలుతప్పిన బోగీలను వేరుచేసి మరో ఇంజన్ సాయంతో రైలును తెల్లవారు జామున 3.30గంటలకు శ్రీవెంకటేశ్వర పాళెం స్టేషన్‌కు తరలించారు. ఇంజన్ కింద ఇరుక్కుపోయిన ఆవుల కళేబరాలను అతికష్టం మీద సిబ్బంది తొలగించారు. దెబ్బతిన్న పట్టాలను సరిచేసి, రైలు ఇంజన్‌తో పాటు పట్టాలు తప్పిన బోగీని కావలికి తరలించారు. ఉదయం 7.12గంటలకు శ్రీవెంకటేశ్వరపాళెం రైల్వేస్టేషన్ నుంచి రైలు బయలుదేరింది.

ప్రమాదంలో ప్రాణాపాయం లేక పోవడంతో అధికారులు ఊపిరి పీల్చు కున్నారు. అయితే కాపరుల నిర్లక్ష్యం వల్లనే మూగజీవాలు బలికావడం విచారకరం.

# మద్యం అమ్మకాలు పెరిగాయి

## గ్రామాల్లో గొడవలు ముదిరాయి

నెల్లూరుజిల్లాలోని నెల్లూరు, గూడూరు ఎక్సైజ్ జిల్లాల పరిధిలో బెల్టుదుకాణాల వ్యాపారం మూడు ఫుల్‌బాటిళ్లు... ఆరు ఆఫ్‌బాటిళ్లుగా వెలిగిపోతున్నాయి. గ్రామ గ్రామాన, వీధికొకటి వెలుస్తున్నా ఎక్సైజ్ శాఖ మాత్రం కమాన్... క్యారీఆన్... డోన్ట్ వర్రీ అంటూ సంకేతాలు ఇస్తుంది. ఇంకో వైపు అసలుధరకన్నా ఎక్కువ అమ్మకాలు సాగిస్తున్నా పట్టించుకోవడంలేదు. ఎక్సైజ్ సిబ్బందికి భారీగా ముడుపులు అందుతు న్నాయి. కాబట్టే సరైన చర్యలు చేపట్టడం లేదని ఆరోపణలు, విమర్శలు వినవస్తు న్నాయి. నెల్లూరు, గూడూరు ఎక్సైజ్ జిల్లాల పరిధిలో 346 మద్యం దుకాణాలు, 46 బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. వీటి కనుసన్నల్లో వేలసంఖ్యల్లో బెల్టుదుకాణా లున్నాయి. ఇలాంటి దుకాణాలను తొలగిం చాలని ప్రభుత్వం ఆదేశించినా ఫలితం లేదు. దీంతో ప్రతిగ్రామంలోని పచ్చని కుటుంబాల్లో చిచ్చురేగుతుంది. గుడికి, బడికి సమీపంలో మద్యం దుకాణాలు ఉండకూడదనే నిబంధనలు ఉన్నా, యథేచ్ఛగా ఏర్పాటుచేసి విక్రయిస్తున్నారు. పర్యాటక ప్రాంతాలైన మైపాడు బీచ్, కోడూరు బీచ్‌లలో కూల్‌డ్రింక్‌షాపుల్లోనే అనధికారికంగా మద్యం విక్రయాలు జరు గుతున్నా పట్టించుకోవడం లేదు. నెల్లూరు, గూడూరు ఎక్సైజ్‌జిల్లాల పరిధిలో నెల్లూరు నగరం, రూరల్, కావలి, ఆత్మకూరు, ఉదయగిరి, మర్రిపాడు, వింజమూరు, రాపూరు, పొదలకూరు, కోవూరు, బుచ్చిరెడ్డి పాళెం తదితర ప్రాంతాల్లో ఎక్కడా నిబం ధనలు పాటించడంలేదు. జూలై నుంచి కొత్త ఎక్సైజ్ పాలసీ రావడంతో మద్యం వ్యాపారులు ఎమ్మార్పీ ధరలకంటే అధి కంగా విక్రయిస్తున్నారు. ఇంత బహిరం గంగా దోపిడీ జరుగుతున్నా అధికారులు మాత్రం మత్తులో జోగుతున్నారన్న విమ ర్శలు వినవస్తున్నాయి. ష్.. సైలెన్స్... ప్లీజ్...

# రైతుల 'ఋణం' తీర్చుకుందాం

నెల్లూరు గాంధీబొమ్మ దగ్గరున్న జిల్లా కేంద్ర సహకార బ్యాంకు కార్యాలయంలో ఈనెల 23న మహాజన సభ జరిగింది. ఈ సందర్భంలో బ్యాంకు ఛైర్మెన్ ఎం.ధనుంజయ రెడ్డి మాట్లాడుతూ రైతులకు సహాయపడే విధంగా స్వల్పకాలిక రుణాల పంపిణీకి సంబంధించి వ్యక్తిగత రుణపరిమితి లక్షకు పెంచామని, పొగాకు, చెరకు పంటలకు రైతులకు ఇచ్చే వ్యక్తిగత రుణ పరిమితి 3లక్షలకు పెంచేటట్లు తీర్మానం చేసామన్నారు. పొగాకు బోర్డు, చక్కెర కర్మాగారాలతో ఆ రైతులు ఒప్పందం చేసుకొని వుండాలన్నారు. ప్రస్తుతం బ్యాంకులో 94.73కోట్లు వున్నాయని, ఈ ఆర్థిక సంవత్సరంలో 140కోట్లు డిపాజిట్లు లక్ష్యంగా నిర్ణయించామని పేర్కొ న్నారు. భారత రిజర్వ్‌బ్యాంకు నియమిం చిన ఎక్స్‌పర్ట్ కమిటీ చేసిన సిఫార్సులపై చర్చించామని, అవి సహకార సంఘాలకు హాని కలిగించేలా వున్నందున వాటిని నిలుపుదల చేయాలని, నాబార్డు కోరేలా తీర్మానం చేసినట్టు తెలిపారు. ఈ సభలో సీఈఓ కె.వి.రమణారెడ్డి, పాలకవర్గం నాబార్డు డిడిఎం వివేకానందరెడ్డి పాలకసభ్యులు, వివిధ సంఘాల అధ్యక్షులు, డీజీఎంలు పాల్గొన్నారు.

## 28న అర్బన్‌బ్యాంకు మహాజన సభ

ది నెల్లూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ మహాజనసభ ఈ నెల 28వ తేదీ సాయంత్రం 4గంటలకు బ్యాంకు ఆవరణంలో జరుగుతుందని, సభ్యులు, డిపాజిట్‌దారులు హాజరై మహాజన సభను జయప్రదం చేయాలని బ్యాంకు పాలకవర్గం ఒక ప్రకటన ద్వారా తెలిపింది.

# న్యాయమూర్తి సుదర్శన్‌రెడ్డిపై పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు

లోకాయుక్త న్యాయమూర్తి బి.సుదర్శన్‌రెడ్డి ఇరుప్రాంతాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టేలా మాట్లాడడాన్ని ఆరోపిస్తూ చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ వైసిపి నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సోమవారం నెల్లూరు నాలుగవ నగర పోలీస్‌స్టేషన్ ఎస్సై మల్లికార్జునకు ఫిర్యాదుచేసారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ సీమాంధ్రలో ఉద్యమాలుచేస్తున్న వారిని దుర్యో ధనుడితో పోలుస్తూ వారి తొడలు విరగొట్టండంటూ ఆయన తెలంగాణా వారిని రెచ్చగొట్టారని పేర్కొన్నారు. రాష్ట్ర విభజనను వ్యతిరేకిస్తూ సీమాంధ్రలో స్వచ్ఛందంగా ఉద్యమిస్తున్న తరుణంలో తెలుగుజాతిని విచ్ఛిన్నం చేయాలనే కుట్రతో సీమాంధ్రప్రజలను కించపరిచేలా, వారి మనోభావాలను దెబ్బతీసే విధంగా ఆదివారం సుదర్శనరెడ్డి అఖిల భారత తెలంగాణా రచయితల వేదిక మహాసభలో వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. శ్రీధర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించినట్లు నాల్గవ నగర ఎస్సై మల్లికార్జున తెలిపారు.

PDF Compressor Free Version

PDF Compressor Free Version



# రాజన్న బిడ్డ

(మొదటిపేజీ తరువాయి)

ఒక పెద్ద ఉద్యోగానికి ఎవరినైనా ఎంపిక చేసేముందు వారికి ఎన్నో పరీక్షలు పెడతారు. ఆ బాధ్యతలు నెరవేర్చగల సామర్థ్యం వుందా లేదా అని తెలుసుకోవడానికే ఈ పరీక్షలు. పోలీసు కానిస్టేబుల్ వంటి చిన్న ఉద్యోగానికే కఠిన పరీక్షలు పెడుతుంటారు. మరి కొన్ని కోట్లమంది ప్రజల ఆశలను, ఆకాంక్షలను నెరవేర్చే బాధ్యతలను ఒక వ్యక్తికి అప్పగించాలంటే ఇంకెంతటి కఠినపరీక్షలు పెట్టాలి. అలాంటి కఠిన పరీక్షలే జగన్ ఎదుర్కొన్నాడు. ఈ పరీక్షను పెట్టింది యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషనో, ఇంటర్మీడియట్ బోర్డో, జెఎన్‌టియునో కాదు... సాక్షాత్తూ దైవమే ఆయనకు కఠినపరీక్షను పెట్టాడు. హఠాత్తుగా తండ్రిని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో వున్న జగన్‌కు అది మొదటి పరీక్ష. ఆ పరీక్షలో ఆయన మానసిక ధైర్యాన్ని కూడగట్టుకుని బంధుమిత్రులను ఓదార్చడమే కాక, తన తండ్రి మరణ వార్తను తట్టుకోలేక మరణించిన వారి కోసం రాష్ట్రవ్యాప్తంగా ఓదార్పుయాత్రలు జరిపి ఎన్నో వందల కుటుంబాలకు అండగా నేనున్నానంటూ భరోసా ఇచ్చి ఆత్మస్థైర్యంతో, మానసిక ధైర్యంతో ఎవరెస్ట్ అంత ఎత్తు నిలిచాడు. అక్కడితో అది ఆగలేదు...

భారతీయ భాష, భావం, ఇక్కడ సంస్కృతి, సెంటిమెంట్లు ఏ మాత్రం తెలియని, తెలిసినా పట్టించుకోని సోనియా గాంధీ తన అధికారాన్ని అహంకారాన్ని దెబ్బతీసాడనే కోపంతో జగన్‌పై కక్ష సాధింపు చర్యలకు పూనుకుంది. సిబిఐని పావుగా వాడుకుంటూ అక్రమకేసులను బనాయించింది.

కేంద్రంలో రెండుసార్లు యూపిఏ ప్రభుత్వం ఏర్పడడానికి వైయస్సే కారణం. కాని సోనియా ఆ కృతజ్ఞతను మరచింది. జగన్‌పైకి సిబిఐని ఉసిగొల్పింది. వై.యస్ సీఎంగా వుండగా ఆయన అధికారాన్ని అడ్డం పెట్టుకుని అక్రమాస్తులు కూడపెట్టాడంటూ జగన్‌పై కేసులు నమోదు చేయించింది. చంచల్‌గూడ జైలులో పెట్టించింది. సోనియా మాట వినకపోతే ఎవరికైనా జరిగే కాంగ్రెస్ మార్కున్యాయం ఇదే! 2012 మే 27వ తేదీన జగన్‌ను చంచల్‌గూడ జైలుకు పంపారు. బెయిల్‌కు కూడా సాధ్యంకాని కేసులను ఆయన మీద పెట్టారు. కాంగ్రెస్ ఆడమన్నట్టల్లా ఇక్కడ సీబీఐ ఆడసాగింది. జగన్‌ను లక్ష్యంగా చేసుకుని మరికొందరు మంత్రులు, ఉన్నతాధికారుల మీద కూడా కేసులు నమోదు చేసారు. జగన్ జైలులో వుండగానే కాంగ్రెస్ అధిష్టానం ఆయనను లోబరచుకోవడానికి ఎన్నో ప్రయత్నాలు చేసింది. జగన్ ప్రభంజనంతో రాష్ట్రంలో కాంగ్రెస్ కనుమరుగయ్యే పరిస్థితిని గమనించి, తిరిగి కాంగ్రెస్‌లోకి రావాలని, వస్తే కేసులు ఎత్తేయిస్తామని కూడా రాయబారం పంపింది. మాటతప్పడం మడమ తిప్పడం తమ వంశంలోనే లేదంటూ కాంగ్రెస్ రాయబారాన్ని జగన్ తిప్పికొట్టాడు. తాను నమ్మిన జనం కోసం, తనను నమ్మిన జనం కోసం ఎన్నిరోజులైనా జైలులోనే వుండడానికి సిద్ధమయ్యారు. జగన్ జైలులో వుంటే బయట పార్టీ నాయకత్వ బాధ్యతలను తల్లి విజయమ్మ, చెల్లెలు షర్మిల తమ భుజస్కంధాలపై మోసారు. వారు రాష్ట్రమంతటా సభలు నిర్వహించారు. రాష్ట్ర విభజన ప్రకటనను నిరసిస్తూ విజయమ్మ దీక్షకు పూనుకున్నారు. జగన్ జైలులోనే నిరాహార దీక్ష చేపట్టారు. షర్మిల సమైక్య శంఖారావ యాత్ర జరిపింది. జైలులో కూడా రాష్ట్రాన్ని సమైక్యంగా వుంచడం కోసమే జగన్ పోరాడారు. జగన్‌ను జైలులో వుంచి 16నెలలయ్యింది. ఎలాంటి కేసుల్లోనైనా ముద్దాయికి 90రోజుల్లోపే బెయిల్ వస్తుంది. కాని జగన్ మీద ఛార్జిషీట్లు బలంగా బిగించి సిబిఐ బెయిల్‌ను అడ్డుకుంటూ వచ్చింది. అయితే కేసు తుది విచారణకొచ్చేసరికి ఈ కేసులన్నింటిలోనూ జగన్‌కంటే కూడా మంత్రులనే చేర్చాల్సిన పరిస్థితి వచ్చింది. ఎందుకంటే జగన్‌పై నమోదైన కేసుల్లో ఎక్కడా ఆయన ప్రత్యక్ష ప్రమేయంలేదు. మంత్రుల జీవోలే ఆధారం. ఈ కేసులను ఇంకా కొనసాగించాలంటే ముందుగా మంత్రులను జైలుకు పంపాలి. ఇప్పటికే మోపిదేవి రమణను జైలులో పెట్టగా, ధర్మాన ప్రసాదరావు మంత్రి పదవిని వదులుకోవాల్సి వచ్చింది. ఇంకొందరు మంత్రులపై కూడా సిబిఐ ఛార్జిషీట్లు వేసింది. జగన్‌పై కక్షసాధించుకోవాలంటే సొంత మంత్రులను బలితీసుకోక తప్పదు. కాని ఇలా చేస్తే పార్టీలో ఎవరూ మిగలరు... నేతలు, కార్యకర్తల్లో కూడా వ్యతిరేకత వస్తుందని కాంగ్రెస్ అధిష్టానం గ్రహించినట్లుంది కాబోలు సిబిఐపై ఒత్తిడి తగ్గించింది. ఇక సిబిఐ తుది ఛార్జిషీటు కూడా దాఖలు చేయడంతో చట్టప్రకారమే జగన్ బెయిల్‌పై బయటకొచ్చాడు. జగన్ రాక కోసం రాష్ట్రవ్యాప్తంగా కోట్ల కళ్లు ఎదురుచూసాయి. 23న సిబిఐ కోర్టు ఆయనకు బెయిల్ మంజూరుచేసింది. 24న సాయంత్రం 4గంటలకు జామీనుల ప్రక్రియ పూర్తయ్యాక ఆయన చెంచల్‌గూడ జైలు నుండి బయటకొచ్చారు. చెంచల్‌గూడ పరిసరాలు జనసంద్రాన్ని తలపించాయి, జగన్‌ను చూడగానే అభిమానుల ఆనందానికి హద్దు లేకుండా పోయింది. జగన్‌పై పూలవర్షం కురిపించారు. ఆ గంటలో రాష్ట్రంలోని అన్ని ఇళ్లల్లో ప్రజలు టీవీలకు అతుక్కుపోయి జగన్ రాకకోసం ఎదురు చూసారు. చెంచల్‌గూడ జైలు నుండి 4 గంటలకు బయలుదేరిన ర్యాలీ రాత్రి 10 గంటలకు లోటస్‌పాండ్‌లోని ఇంటికి చేరిందంటే అభిమానం ఏ స్థాయిలో ఆయనకు స్వాగతం పలికిందో అర్థం చేసుకోవచ్చు. 485 రోజుల తర్వాత తమ ముందు కొచ్చిన జగన్‌ను చూసి తల్లి, భార్య, చెల్లెలు, కూతుర్లు, అన్నలు, వదినలు, చిన్నానలు, పిన్నమ్మలు, వైకాపా నేతలు, కార్యకర్తలు అభిమానులు ఆనందాశ్రువులతో జగన్‌కు అభిషేకం చేసారు.

**రాజకీయాలపై ప్రభావం:**

ప్రస్తుతం రాష్ట్రం మండిపోతుంది. కాంగ్రెస్ విభజన ప్రకటనతో రాష్ట్రం రెండుగా చీలిపోయి రెండు ప్రాంతాల వారు ఒకరిపై ఒకరు కత్తులు నూరుకుంటున్నారు. ఈ తరుణంలో రాజన్న బిడ్డ రాక రాష్ట్ర రాజకీయాలపై తీవ్ర ప్రభావమే చూపబోతుంది. ఆయన రాక రానున్న రోజుల్లో రాజకీయాల్లో కాక పుట్టించబోతుంది.

# బాంబుంది జాగ్రత్త

- ఆగంతకుడు ఫోన్‌కాల్
- ఆసుపత్రిలో పోలీసుల తనిఖీ
- పరుగులు తీసిన రోగులు, సిబ్బంది

మీ ఆసుపత్రిలో బాంబు పెట్టాం...అది ఏ క్షణంలోనైనా పేలవచ్చు రోగులను వెంటనే బయటకు పంపేయండి అంటూ నెల్లూరు బృందావనంలోని డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాలకు ఒక అగంతకుడు ఫోన్‌చేసి చెప్పడంతో పెద్ద కలకలం రేగిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాల మేరకు నెల్లూరు రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల రిసెప్షన్‌కు మంగళవారం ఉదయం 10-30గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి ఫోన్‌చేసాడు. ఆసుపత్రిలో బాంబు పెట్టామని చెప్పడంతో రిసెప్షన్ సిబ్బంది వెంటనే ఆసుపత్రి సీనియర్ డాక్టర్లు రమణయ్య, అజయ్ కుమార్‌లకు సమాచారం అందించారు. వారు పోలీసులకు సమాచారం అందించడంతో డాగ్‌స్క్వాడ్, సాయుధదళాలు, మూడవనగర పోలీసులు ముందుగా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వారు విషయాన్ని బయటకు తెలియనీయకుండా తనిఖీలు చేస్తుండగా రోగులు, వారి బంధువులు గ్రహించి ఆందోళన చెందారు, భయంతో బయటకు పరుగులు తీసారు. బాంబ్‌స్క్వాడ్ సిబ్బంది 4గంటల పాటు అణువణువు గాలించారు. పోలీసులు తనిఖీలు చేసిన అనంతరం బాంబు ఉత్తిదేనని ఆకతాయి చేష్టలుగా పోలీసులు తేల్చడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. సంఘటన స్థలాన్ని నెల్లూరు నగర డిఎస్పీ పి.వెంకటనాథ్‌రెడ్డి పరిశీలించారు.

సమైక్యాంధ్ర కోసం...

# ముద్రణ కార్మికుల ర్యాలీ



సమైక్యాంధ్రను కాంక్షిస్తూ ఈనెల 24న నెల్లూరులోని ఏ.పి. మాస్టర్ ప్రింటర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు నగర ప్రింటర్ ప్రెస్, బైండింగ్, రబ్బర్ స్టాంప్స్ యజమానులు, ముద్రణ కార్మికులు, డి.టి.పి ఆపరేటర్లు బంద్ పాటించి ర్యాలీని జరిపారు. రాయాజీవీధి నుంచి గాంధీబొమ్మ, ఏ.సి.బొమ్మ, కనకమహల్, వి.ఆర్.కళాశాల మీదుగా ర్యాలీ జరిపి రాయాజీవీధిలో వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఒక బైండింగ్ కార్మికుని కుమారుని వైద్య ఖర్చులకు సహాయంగా రూ20,000/- అసోసియేషన్ తరపున అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు అల్లు కేశవరావు, ఉపాధ్యక్షుడు జి.ప్రతాప్‌రెడ్డి, కార్యదర్శి పి.వి.రమణారెడ్డి, సహాయకార్యదర్శి కె.రాంబాబు, కోశాధికారి ఏ.శ్రీనివాసులు, గౌరవ సలహాదారులు యం.చంద్రమౌళిరెడ్డి, యం.ఆదినారాయణరెడ్డి, యం.వరదారెడ్డి, కె.వి.రత్నం, సభ్యులు యం.నాగేశ్వరరావు, వై.మహేశ్వరరావు, జి.ఉమామహేశ్వరరావు, పి.రంగారావు, వి.గిరిధరరావు, చిన్నయ్య, కెనడి పాల్గొన్నారు.

# గర్జించిన 'సింహ'పురి

(మొదటిపేజీ తరువాయి)

రెండు నెలలుగా అదే ఊపు... అదే రూపు... ఆగని ఆందోళనలు... కొనసాగుతున్న నిరసనలు... తెరచుకోని పాఠశాలలు... పనిచేయని కార్యాలయాలు... జీతాలు లేవు... ఖర్చులకు డబ్బులు లేవు. అయినా ఉద్యోగులు లెక్కచేయడం లేదు. బంద్‌లు, రాస్తారోకోలు, ర్యాలీలు, వాహనగర్జనలు, కుల గర్జనలు, వృత్తుల వారి సమైక్యభేరీలు... రకరకాల వర్గాలతో రకరకాల రూపాలతో జిల్లాలో సమైక్యాంధ్ర ఉద్యమం ఉధృతంగా జరుగుతుంది. వివిధ పార్టీల నేతలు కూడా తమ పార్టీ జెండాలను పక్కనపెట్టి సమైక్యాంధ్ర జెండాను పట్టుకుని ఉద్యమంలో ముందుండి నడుస్తున్నారు.

దాదాపు 50రోజులుగా జిల్లాలో ఆర్టీసీ బస్సులు నడవలేదు. గతంలో ఒక్కరోజు బంద్ నిర్వహిస్తేనే ఆర్టీసీ బస్సులు ఆగిపోయి ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడేవాళ్లు. కాని 50రోజులుగా బస్సులు లేకపోయినా ప్రజలు అస్సలు పట్టించుకోవడం లేదు. ఎందుకంటే ఇది ప్రజలు చేస్తున్న బంద్ కాబట్టి. నెల్లూరు నగరంలో రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి, నగరఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిలు సమైక్యాంధ్ర ఆందోళనలకు నేతృత్వం వహిస్తున్నారు. ఉద్యమాలను వినూత్న రీతిలో నిర్వహించడంలో వివేకాకు స్పెషల్ డిగ్రీ వుంది. ఈమధ్య నెల్లూరులో 'సహస్రవాహనగర్జన' పేరుతో వాహనాల ర్యాలీ పెట్టాడు. ఆయన వెయ్యి వాహనాలు వస్తే బ్రహ్మాండమనుకున్నాడు. కాని బైక్‌లు, కార్లు, ట్రాక్టర్లు, స్కూల్‌వ్యాన్లు, జేసీబీలు, ఆటోలు... ఇలా అన్ని రకాల వాహనాలు కలిపి మూడువేలకు మించాయి. వాహనాలతో ఇంతటి భారీస్థాయి ర్యాలీ సీమాంధ్రలోని 13జిల్లాల్లో ఎక్కడా జరక్కపోవడం విశేషం.

సమైక్యాంధ్ర జేఏసీ నాయకులు సి.హెచ్.పెంచలరెడ్డి, బి.రామిరెడ్డిల ఆధ్వర్యంలో జిల్లా అంతటా ఆందోళనలు ఉధృతమవుతున్నాయి. రోజుకో కులం వారు సమైక్యగర్జనలు నిర్వహిస్తున్నారు. ఉద్యోగసంఘాలు, కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు ఎత్తిన సమైక్యాంధ్ర జెండాను దించడంలేదు. సదస్సులు, సమావేశాలతో కొందరు, ర్యాలీలతో నిరసనలతో మరికొందరు, నిరాహారదీక్షలు, ధర్నాలతో మరికొందరు... జిల్లాలోని ప్రజలందరూ ఉద్యమంలో మమేకమవుతున్నారు.

# రోడ్డు పైనే జిమ్



రోడ్డుపైన బస్కీలు తీస్తున్న కార్యకర్తలు

సమైక్యాంధ్రను కోరుతూ జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు యశ్వంత్ సింగ్ ఆధ్వర్యంలో 22వ తేదీన నెల్లూరులోని బట్వాడి పాళెంలో వినూత్న నిరసన కార్యక్రమం జరిగింది. యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు బస్కీలు తీస్తూ జైసమైక్యాంధ్ర నినాదాలు చేసారు. ఈ కార్యక్రమంలో యువ కాంగ్రెస్‌నాయకులు ఆనం రంగ మయూర్‌రెడ్డి, అనిల్, వెంకటేష్, శివ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. రోడ్డుపై బస్కీలు తీస్తూ కుస్తీలు పడుతూ యువజన కాంగ్రెస్ కార్యకర్తలు నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమం ఆ దారిన పోయే ప్రజలను ఆకర్షించింది.

## కాలధర్మం

# గునుపాటి బుజ్జమ్మ



పార్లమెంటు సభ్యులు డా॥ టి.సుబ్బరామిరెడ్డి సతీమణి ఇందిరా సుబ్బరామిరెడ్డి మాతృమూర్తి శ్రీమతి గునుపాటి బుజ్జమ్మ(84) 25వ తేదీ బుధవారం రాత్రి హైదరాబాద్‌లో కన్నుమూసారు. ఆమెకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు వున్నారు. ఆమె భర్త గునుపాటి వేణుగోపాలకృష్ణారెడ్డి రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్‌గా పదవీవిరమణ చేసారు. జివికె ఇండస్ట్రీస్ అధినేత జి.వి.కె.కు ఈమె పిన్నమ్మ అవుతారు. ఇందుకూరుపేట మండలం కొత్తూరు స్వగ్రామం. ఆమె మృతిపట్ల సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# వేగూరు శ్రీనివాసులురెడ్డి



నెల్లూరులోని విఎస్ఆర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ అధినేత వేగూరు శ్రీనివాసులురెడ్డి ఈ నెల 25న చెన్నైలోని గ్లోబల్ ఆసుపత్రిలో కన్నుమూసారు. ఆయన వయసు 48సంవత్సరాలు. ఆయనకు భార్య, ఒక కుమార్తె వున్నారు. ఇందుకూరుపేట కొత్తూరు ఆయన స్వగ్రామం. బెంగుళూరులో బిటెక్ చదివిన శ్రీనివాసులురెడ్డి కొంతకాలం సి.వి.శేషారెడ్డి అనుచరుడిగా రాజకీయాల్లోనూ వున్నారు. తర్వాత నర్తకి సెంటర్‌లో ఓ గార్మెంట్ షోరూంను ప్రారంభించారు. ఆపైన విబిఆర్ విద్యాసంస్థలకు కరస్పాండెంట్‌గా వ్యవహరిస్తూ, అటు తర్వాత సొంతంగా విఎస్ఆర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌ను నెలకొల్పారు. కొద్దికాలంగా ఆయన కాలేయానికి సంబంధించిన వ్యాధితో చికిత్స పొందుతూ మరణించారు. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ, వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

PDF Compressor Free Version



# గూడూరు డివిజన్ వార్తలు

## ద్రోహులు... సీమాంధ్రనేతలు



రోడ్డుపై గుంజీలు తీస్తున్న జేఏసీ. ఆర్టీసీ కార్మికులు

పదవీ వ్యామోహంలో ప్రజలను ద్రోహం చేస్తున్న సీమాంధ్ర ప్రాంతానికి చెందిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు వెంటనే రాజీనామా చేయాలని సమైక్యవాదులు ధ్వజమెత్తారు. ఆర్టీసీ జేఏసీ, సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి వారు టవర్ క్లాక్ వద్ద మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర మంత్రుల తీరును నిరసిస్తూ, రాష్ట్ర విభజన అడ్డుకోవాలంటూ గుంజీలు తీసి వినూత్న నిరసన వ్యక్తం చేశారు. సమైక్యాంధ్ర కోసం 54రోజులుగా సమైక్యవాదులు చేస్తున్న దీక్షలు ఆదివారం కూడా సాగాయి. టవర్ క్లాక్ వద్ద ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో ఆర్టీసీ కార్మికులు పాల్గొని దీక్షచేపట్టారు. రాష్ట్రం సమైక్యంగా ఉండాలని సీమాంధ్ర ప్రాంతాల్లోని అన్ని వర్గాల ప్రజలు ఉద్యమాలు చేస్తుంటే వారి ఓట్ల ద్వారా పదవులు పొందినవారు మాత్రం ప్రజల మనోభీష్టం మేరకు నిర్ణయాలు తీసుకోకుండా ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారని, వారికి ఇకపై ప్రజల వద్దకు వచ్చే అవకాశాలు లేవని, సిగ్గులేకుండా వస్తే వారిని ప్రజలు ఖచ్చితంగా తరిమి కొడుతారన్నారు.

సాధారణ ఆర్టీసీ ఉద్యోగులు జీతాలు రాకున్నా తమకు జీవితాలే ముఖ్యమని తలచి పోరాడుతున్నారన్నారు. ఇకనైనా యూపీఏ ప్రభుత్వం తన మొండి వైఖరిని మానుకుని వెంటనే సమైక్యాంధ్రను ప్రకటించాలని, లేదంటే రాబోయే రోజుల్లో సమైక్యాంధ్ర కోసం జరుగుతున్న ఉద్యమాలు మరింత ఉధృతమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు మస్తానయ్య, రాజేంద్రప్రసాద్, దశరథరామిరెడ్డి, జక్కంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నీలాం రాజారెడ్డి, ఓబులేసు, సురేష్‌కుమార్, నారాయణ, వీఎస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తల్లీ కూతురిది ఆత్మహత్యే!

గూడూరు పట్టణంలోని దర్గావీధిలో ఏప్రిల్ 7వ తేదిన అనుమానాస్పద స్థితిలో మృతదేహాలై కనిపించిన తల్లీ కూతుళ్ళు విషం తీసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు వైద్య నివేదికలు వచ్చాయని గూడూరు 1వ పట్టణ ఎస్సై షేక్ షరీఫ్ తెలిపారు. గూడూరు పట్టణంలోని 1వ పోలీసు స్టేషన్‌లో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తల్లి విమలమ్మ, కూతురు రాణి విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారని ఫోరెన్సిక్ నివేదికలో వెల్లడైందని తెలిపారు.

ఆత్మహత్యకు దారితీసిన కారణాలపై దర్యాప్తు సాగిస్తున్నామన్నారు. పట్టణంలో సంచలనం రేపిన మిర్చి వ్యాపారి దుగ్గిశెట్టి కృష్ణయ్య హత్య కేసు దర్యాప్తు ముమ్మరం సాగుతుందని, త్వరలో మిస్టరీని ఛేదిస్తామని విలేకర్లతో అన్నారు.

## న్యాయం నిలిచింది.. ధర్మం గెలిచింది



ఆనందంతో నృత్యంచేస్తున్న పాశం సునీల్‌కుమార్

సోమవారం జగన్మోహన్‌రెడ్డికి బెయిల్ రావడంతో గూడూరు టవర్‌క్లాక్ సెంటర్‌లో వైఎస్సార్‌సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త పాశం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. అదే విధంగా బత్తిని విజయ కుమార్ పాత మోతిమహాల్ వద్ద మహా సమన్వయకర్త డాక్టర్ బాలచెన్నయ్య నివాసం వద్ద పండుగ వాతావరణం నెలకొంది. ఆయా ప్రాంతాలకు భారీసంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు వచ్చి బాణసంచా కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్, టీడీపీ పన్నిన కుట్రలు, కుతంత్రాలు ఛేదించుకొని జగన్మోహన్‌రెడ్డి కడిగిన ముత్యంలా బయటకు వచ్చారన్నారు. దీంతో మరోసారి మచ్చలేని మడమతిప్పని నాయకుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని రుజువైందన్నారు. చెన్నూరులో శ్రీకిరెడ్డి రాధాకృష్ణారెడ్డి పెద్ద ఎత్తున బాణసంచా పేల్చి స్వీట్లు పంచిపెట్టారు. అలాగే వైఎస్సార్ అభిమానులు సీఆర్ కళాశాల కరస్పాండెంటు సి.విజయమోహనరెడ్డి ఆధ్వర్యంలో చెన్నూరులో వైఎస్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించి స్వీట్లు పంచిపెట్టి సంబరాలు చేసుకున్నారు.

## మూ'వీ'క్షణం 100 YEARS OF CINEMA

### వందేళ్ళ సినిమా పండుగలో

## తెగులు సోకిన తెలుగు సినిమా



వందేళ్ళ సినిమా పండుగ అంటే ఎంత గొప్ప భావం ఏర్పడుతుంది. చిత్రసీమలోని ప్రతిఒక్కరి మనస్సులోనే కాదు, ప్రేక్షకులందరిలోనూ ఆ భావంతో ఉత్సాహం ఉరకలేస్తుంది, ఉత్తేజం ఉప్పెనవుతుంది.

కాని, చెన్నైలో ఇటీవల జరిగిన ఈ ఉత్సవం తెలుగువారి మనస్సులను కలచివేసింది. రాష్ట్రంలో నెలకొన్న ఉద్యమ పరిస్థితుల దృష్ట్యా తమ సభ్యులైన నటీనటులు ఈ ఉత్సవాల్లో పాల్గొనరాదంటూ తెలుగు మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ పేర్కొనడంతో ప్రారంభంరోజు తెలుగు పెద్దలెవరూ పాల్గొనలేదు. తెలుగుతారలు ఈ వేడుకలో పాలుపంచుకోవడం గురించి నెల్లూరీయుడైన ప్రముఖనిర్మాత సి.కల్యాణ్‌ను ప్రారంభోత్సవానికి ముందు మీడియా ప్రశ్నిస్తే తెలుగు వాళ్ళను నా మనస్సులో నుంచి తీసేశాను నేను వారి గురించి ఆలోచించడంలేదు. నా ఆలోచనలన్నీ వేరే అంశాల మీద వున్నాయి అని చెప్పడం ఆశ్చర్యానికి గురిచేసింది. అంతేకాక ప్రారంభోత్సవానికి హాజరైన తెలుగు మీడియాను అనుమతించలేదు. పాస్‌లు జారీచేయలేదు. మరో ప్రముఖ నిర్మాత, నిర్వాహకులు కె.యస్.రామారావు పర్యవేక్షణలో పాస్‌లు జారీ జరుగుతాయేమోనని సంప్రదిస్తే, మా వాళ్ళు మిమ్మల్ని కలుస్తారు అంటూ ముక్తసరిగా చెప్పేసి వెళ్ళిపోయాడు. ఎవరు మా వాళ్ళు, ఎలా కలుస్తారు అనేది స్పష్టతలేదు. చివరికి వేరే నిర్మాత ద్వారా పాస్ పొంది లోపలికి వెళితే, ల్యాప్‌ట్యాప్‌లు, కెమెరాలు సెక్యూరిటీ సిబ్బంది వద్దే వుంచేసుకున్నారు. వాటిని లోపలికి అనుమతించలేదు. జూన్ 30న హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో నిర్మాతలు కె.ఎస్.రామారావు, సి.కల్యాణ్‌లు పాత్రికేయులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం అని ప్రకటించిన మాటలేమయ్యాయి. దక్షిణాది సినీప్రపంచంలో ప్రముఖ స్థానమున్న తెలుగు సినీపరిశ్రమకు ఇక్కడ అవమానం జరిగిందని చెప్పవచ్చు. తెలుగు చిత్ర ప్రముఖులకు ఆహ్వానాలను సక్రమంగా ఇవ్వలేకపోయిన ఈ పెద్దలు తెలుగు సినిమా గురించి చెన్నైలో జరిగిన ఉత్తుత్తి ఉత్సవంలో విమర్శలు గుప్పించడం మరో విశేషం. పైగా చేసిన తప్పులను అంగీకరించకపోగా చిన్న, చిన్న పొరపాట్లు సహజం అని తమని తాము సమర్థించుకోవడం ఆత్మహత్యా సదృశం. ఏదేమైనా దక్షిణాది చిత్ర పరిశ్రమలోనేకాదు భారతీయ సినీచరిత్రకే తలమానికంగా నిలిచే తెలుగు చిత్రసీమ గౌరవానికి తూట్లు పొడిచిన ఈ ప్రబుద్ధులది క్షమించరాని నేరం.

## చీకటి నిరసన

సమైక్యాంధ్రకు మద్దతుగా సమైక్యరాష్ట్ర పరిరక్షణ వేదిక పిలుపు మేరకు గూడూరులోని బజారువీధిలో ఉన్న వ్యాపారస్తులు 22వతేది సాయంత్రం 6గంటల నుండి 8గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి తమ నిరసనను వ్యక్తంచేశారు. రాష్ట్ర విభజన ప్రకటనను వ్యతిరేకిస్తూ వ్యాపారులు జై సమైక్యాంధ్ర అంటూ నినాదాలు చేసారు. ఇప్పటికైనా కాంగ్రెస్ అధిష్టానం స్పందించి రాష్ట్ర ప్రకటనను వెనక్కి తీసుకోవాలని వ్యాపారసంఘ నాయకులు బి.శేషాద్రిరాజు తదితరులు డిమాండ్ చేసారు.



విద్యుత్ సరఫరాను నిలిపి నిరసన తెలుపుతున్న వ్యాపారులు


## అడ్డదిడ్డంగా నెంబర్ ప్లేట్లుంటే కఠిన చర్యలు

మోటార్ వెహికల్ చట్టం ప్రకారం మోటార్ వాహనాల నంబర్ల ప్లేట్లను నిబంధనలకు వ్యతిరేకంగా కలిగి వుంటే కఠిన చర్యలు తీసుకుంటామని 1వపట్టణ ఎస్సై షేక్ షరీఫ్ అన్నారు. గూడూరు టవర్‌క్లాక్ సెంటర్‌లో ఆదివారం జిల్లా ఎస్పీ రామకృష్ణ, డీఎస్పీ చౌడేశ్వరి ఆదేశాల మేరకు వాహనాల నంబర్ల ప్లేట్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనచోదకులకు నంబర్‌ప్లేట్లపై బండి నంబర్లు కనిపించే విధంగా ఏర్పాటుచేయాలని సూచించారు.

తెల్లనంబర్ ప్లేట్లపై నల్లరంగు అక్షరాలతో కేవలం బండి నంబరు మాత్రమే స్పష్టంగా కనిపించేలా ఉండాలని అలా కాకుండా పేర్లు, కొటేషన్లు ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. అసలు పూర్తిగా నంబరులేని వాహనాలను సీజ్ చేయడంతో పాటు జరిమానా విధిస్తామన్నారు. ఈ నెలాఖరులోగా నిబంధనలకు అనుగుణంగా నంబరు ప్లేట్లను ఏర్పాటుచేసుకోవాలన్నారు.

## మారుమ్రోగుతున్న సమైక్యనాదం

గూడూరు పట్టణంలో సమైక్యాంధ్ర ఉపాధ్యాయ, విద్యార్థి జేఏసీ నాయకులు సోమవారం పలు నిరసన కార్యక్రమాలు చేశారు. హోరెత్తిన సమైక్య నినాదాలతో రిలే దీక్షలు చేపట్టారు. అనంతరం మోటార్‌సైకిల్ ర్యాలీ చేశారు. నారాయణ కాలేజీ, డీఆర్‌డబ్ల్యూ కళాశాల నిర్వహిస్తుండటంతో అక్కడ ర్యాలీతో చేరుకొని ప్రిన్సిపాల్‌తో చర్చించి సమైక్య ఉద్యమనికి సహకరించాలని జేఏసీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు మస్తానయ్య, రాజేంద్రప్రసాద్, దశరథ రామిరెడ్డి, రవి, ఓబులేసు, జక్కంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నీలంరాజారెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



PDF Compressor Free Version



# ఫలించని ఢిల్లీయాత్ర



ఆత్మగౌరవయాత్రను రెండు జిల్లాలతో ముగించిన చంద్రబాబునాయుడు వెంటనే ఢిల్లీయాత్ర పెట్టుకుని వెళ్లాడు. జగన్ కేసులో సిబిఐ తుది ఛార్జ్‌షీట్ వేయగానే జగన్‌కు బెయిల్ ఖాయమనే సంగతి చంద్రబాబుకు తెలిసిపోయింది. జగన్ బయటకు వస్తే రాష్ట్ర రాజకీయాల్లో ఎలాంటి పరిణామాలు సంభవిస్తాయో ఆయనకు తెలియంది కాదు. జగన్ ప్రభంజనాన్ని తట్టుకుని నిలబడే పరిస్థితిలో తెలుగుదేశం లేదు. జగన్‌ను జైలులో వుంచడం కోసమే ఆయన ఇంతకాలం కూడా పార్టీ సిద్ధాంతాలు, నైతిక విలువలను పక్కనపెట్టి కాంగ్రెస్‌తో లాలూచీ పడుతూ వచ్చాడు. సహకార ఎన్నికలు, పంచాయితీ ఎన్నికలలో ఉమ్మడి అభ్యర్థులను నిలబెట్టడం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీలో పడ్డ సందర్భాల్లోనూ కాపాడుతూ వచ్చింది చంద్రబాబే! ఆత్మాభిమానాన్ని చంపుకుని ఆయన కాంగ్రెస్‌తో మ్యాచ్‌ఫిక్సింగ్ చేసుకుంది జగన్‌ను అడ్డుకోవడానికే!

కాని సిబిఐ తుదిఛార్జిషీట్ పెట్టేసాక జగన్‌కు బెయిల్ రావడం ఖాయమనుకున్న తరుణంలో ఆయన హడావిడిగా ఢిల్లీయాత్ర పెట్టుకున్నాడు. రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీని కలిసాడు. బీజేపీ, దళ్(యు), సీపీఎం, సీపీఐ నేతలను కలుసుకున్నారు. జగన్‌కు బెయిల్ రాకుండా అడ్డుకోవడానికి ఆయన ఢిల్లీలో చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. జగన్‌కు బెయిల్ వచ్చేసరికి కాంగ్రెస్‌తో తాను పెట్టుకున్న మ్యాచ్‌ఫిక్సింగ్‌ను మరచి కాంగ్రెస్, వైకాపాల మధ్య మ్యాచ్‌ఫిక్సింగ్ జరిగిందంటూ కడుపుమంటతో రగిలిపోతున్నాడు.

# బెయిల్ రాజ్యాంగ హక్కు



హంతకుడికైనా, రేపిస్టుకైనా, దొంగకైనా, దోర్‌కైనా బెయిల్ అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు అని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి పేర్కొన్నారు. బుధవారం నెల్లూరు విఆర్ కాలేజీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత దేశంలో నివసించే ప్రతి పౌరుడికి బెయిల్ హక్కు వర్తిస్తుందన్నారు. ఒక వ్యక్తిపై కక్ష వుంటే అతనిపైనే చూపాలిగాని అతనికి కల్పించిన ప్రాథమిక హక్కులపై కాదని జగన్ బెయిల్ విషయంలో కాంగ్రెస్‌ను విమర్శిస్తున్న పార్టీలకు హితబోధ చేసారు. బెయిల్ వచ్చినంత మాత్రాన దోషులు నిర్దోషులు కారని, న్యాయస్థానం తుదితీర్పులోనే అది వెల్లడవుతుందన్నారు. జగన్‌ను జైల్లో పెట్టినప్పుడు సిబిఐని, కోర్టులను ప్రశంసించిన తెలుగుదేశం నాయకులు బెయిల్ ఇస్తే అవే సంస్థలను తప్పుపట్టడం తగదన్నారు. ఒకవేళ ఈ కేసుల్లో జగన్ నిర్దోషి అని ప్రకటిస్తే ఒకటిన్నర సంవత్సరం జైలుశిక్షను తెలుగుదేశం నాయకులు అనుభవిస్తారా అని ఆయన ప్రశ్నించారు. జగన్ బెయిల్ విషయంలో కాంగ్రెస్‌కు ఎటువంటి సంబంధంలేదన్నారు.

# క్యాన్సర్ ఆసుపత్రికి రూ.లక్ష విరాళం



నెల్లూరు జిల్లా దగదర్తి మండలం పెదపుత్తేడు గ్రామానికి చెందిన తుంగా పాండురంగారెడ్డి నెల్లూరులోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ క్యాన్సర్ ఆసుపత్రికి లక్ష రూపాయలు విరాళాన్ని జిల్లా కలెక్టర్ య.న్.శ్రీకాంత్‌కు బుధవారం అందజేసారు. పాండురంగారెడ్డి తన తల్లి స్వర్గీయ తుంగా శేషమ్మ జ్ఞాపకార్థం ఈ విరాళాన్ని అందజేయడం జరిగింది.

# నేలరాలిన మరో ఉద్యమతార

సమైక్య ఉద్యమంలో మారోమారు మరొకరు ఐక్యమయ్యారు. ఉపాధ్యాయుడు బట్టా శంకరయాదవ్ మృతి సంఘటన మరువక ముందే ఉద్యమంలో మరో విషాదకర సంఘటన చోటు చేసుకుంది. విభజన ప్రకటనతో మనోవేదనకు గురైే ఆర్టీసీ స్క్వాడ్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ సోమశేఖర్‌రాజు(54) నెల్లూరు బస్‌స్టేషన్ ప్రాంగణంలో మరణించారు. పత్రికల్లోని విభజన వార్తలను చదువుతూ తీవ్ర ఉద్వేగానికిలోనై తుదిశ్వాస విడిచారు. ఉద్యమంలో ఉంటూ గుండెపోటుతో నిమిషాల్లో మృతి చెందడం పట్ల కార్మికులంతా విషాదంలో మునిగిపోయారు. ఆర్టీసీ ఉద్యోగి సోమశేఖర్‌రాజు మృతి చెందారని తెలుసుకున్న జిల్లా ఎన్జీవో సంఘం కోకన్వీనర్ ఏజేసి పెంచలరెడ్డి, ఆర్టీవో రాంప్రసాద్, పలువురు ఎన్జీవో సంఘ నాయకులు, ఇరిగేషన్ రెవెన్యూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థి సంఘ నాయకులు ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్నారు. రాజు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సోమశేఖర్‌రాజు స్వస్థలం గూడూరు, సైదాపురానికి సమీపంలోని పెరుమాళ్ళపాడు. 1987లో ఆర్టీసీ బస్సు డ్రైవర్‌గా విధుల్లో చేరారు. ఏడిసి, డిసిగా పదోన్నతులు పొంది ప్రస్తుతం నెల్లూరు జోన్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ స్క్వాడ్‌లో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నారు. ఆయన మరణవార్త తెలిసి కుటుంబసభ్యులు దుఃఖసాగరంలో మునిగిపోయారు.

## వివాదాలకు దూరంగా... విజయాలకు చేరువగా... లక్ష్యసాధనే ధ్యేయంగా...

# కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



**గెలుపుకు పొంగి పోకూడదు. ఓటమికి కుంగిపోకూడదు. ఎదురుదెబ్బలకు వెన్ను చూపకూడదు. వెన్నుపోట్లకు బెదరకూడదు. లక్ష్యంపై గురి వుండాలి. మన ఆశయంలో చిత్తశుద్ధి వుండాలి. త్రికరణశుద్ధిగా మన ఆలోచనా విధానం వుండాలి... అప్పుడే రాజకీయనాయకులు ప్రజానాయకులవుతారు. ప్రజలు మెచ్చిన నాయకులవుతారు. అలా తనను తాను ప్రజానాయకుడిగా మలచుకుంటున్న వ్యక్తే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి.**

లీడర్ అనేవాడు రాజకీయ కుటుంబాల్లో నుండి, రాజ వంశాల్లో నుండో కాదు... సామాన్య కుటుంబంలో నుండి, సాధారణ జనంలో నుండి పుట్టుకొస్తాడనేదానికి ఉదాహరణ కోటంరెడ్డి. పట్టుదల, అంకితభావం, అనుకున్నది సాధించేతత్వం, నమ్మినవారి కోసం తెగించే వ్యక్తిత్వం ఆయనను నమ్మకమైన నాయకుడిగా నిలబెట్టాయి.

విఆర్ కళాశాలలో ఏబివిపి విద్యార్థి నాయకుడిగా క్రమశిక్షణను, కట్టుబాట్లను అలవర్చుకున్న కోటంరెడ్డి ఈరోజుకీ అదే పంథాను అనుసరిస్తున్నారు.

వి.హెచ్.హనుమంతురావు శిష్యుడిగా తొలినాళ్లలో కాంగ్రెస్‌లో రాజకీయాలు నడిపిన కోటంరెడ్డి ఆ వర్గ రొచ్చును చాలా తొందరగానే వదిలించుకున్నాడు. వై.యస్. ఆశయాలకు, ఆయన నాయకత్వానికి ముగ్ధుడై ఆయన అనుచరుడిగా మారాక కోటంరెడ్డిలో అనూహ్య మార్పులొచ్చాయి. ఆవేశం స్థానంలో ఆలోచన చోటుచేసుకుంది. శత్రువును సైతం మిత్రుడిగా మలచుకునే రాజకీయ పరిపక్వత వచ్చింది. కాంగ్రెస్‌పార్టీలో సాధారణ కార్యకర్తలా ఆయన పనిచేసాడు. కాంగ్రెస్ ప్రతిపక్షంలో వున్న పదేళ్లలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎన్నో ఉద్యమాలు నిర్వహించారు. ఆల్‌మట్టి డ్యాం ఎత్తును పెంచడాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని నిర్వహించిన నాయకుడు కోటంరెడ్డే! చంద్రబాబు హయాంలో దారుణంగా పెంచిన కరెంట్‌ఛార్జీలను నిరసిస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయంపై స్వాతంత్ర్యదినోత్సవం రోజున నల్లజెండా ఎగురవేసిన తెగింపు ఆయన సొంతం. తెలుగుదేశం ప్రభుత్వమున్న పదేళ్లలో కరెంట్ ఛార్జీలపైనయితేనేమి, మున్సిపాల్టీ పన్నులపైన అయితేనేమీ ఆయన చేసిన ఉద్యమాలకు ఒక లెక్కలేదు. కాంగ్రెస్‌పార్టీలో ఉద్యమాలనే పునాదిగా చేసుకుని ఎదిగిన నాయకుడాయన.

అయితే కాంగ్రెస్‌లో ఆయన కృషికి తగిన గుర్తింపు రాలేదన్నది నిర్వివాదాంశం. ఆ పార్టీలో నెలకొన్న వర్గ రాజకీయాలు ఆయన దూకుడుకు కళ్లెం వేస్తూ వచ్చాయి.

రాజకీయాలలో పదవులకంటే నమ్మకమే ముఖ్యమనుకునే శ్రీధర్‌రెడ్డి వై.యస్.రాజశేఖరరెడ్డి అభిమానిగా ఆయన తనయుడు వై.యస్.జగన్ వెంట నడిచాడు. జగన్ స్థాపించిన వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో పునాది సభ్యుడయ్యాడు. నెల్లూరురూరల్ నియోజకవర్గ సమన్వయకర్తగా పార్టీపరంగా ఎన్నో కార్యక్రమాలు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మరెన్నో ఉద్యమాలు చేసారు. 141 రోజుల పాటు గ్రామీణ నియోజకవర్గంలో ఆయన చేసిన పాదయాత్ర వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ప్రశంసలందుకోవడం విశేషం. ముఖ్యంగా పార్టీలోని వర్గ రాజకీయాలకు ఆయన దూరంగా వుంటూ వస్తున్నాడు, ప్రక్కవారిని పట్టించుకోవడం మానేసి తన లక్ష్యసాధనే ధ్యేయంగా ముందుకి సాగుతున్నాడు. ఈరోజు వైకాపాలోనే నాయకుడంటే ఎలావుండాలనడానికి కోటంరెడ్డి ఒక రోల్‌మోడల్ అయ్యాడు. ఆయనను ఎమ్మెల్యేగా చూడాలన్నది శ్రీధర్‌రెడ్డి అభిమానుల ఆకాంక్ష. సెప్టెంబర్ 26న ఆయన జన్మదినం సందర్భంగా ఆల్ ది బెస్ట్ టు శ్రీధర్.

# ఇటలీ, ఇడుపులపాయ బిడ్డల కోసమే విభజన చిచ్చు



ఇటలీ తల్లి, ఇడుపులపాయ తల్లులు తమ బిడ్డలను అధికార అందలం ఎక్కించేందుకే రాష్ట్ర విభజన చిచ్చుపెట్టారని తెలుగుదేశంపార్టీ జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర విమర్శించారు. బుధవారం నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాహుల్‌గాంధీని ప్రధానిని చేయాలన్న దుర్బుద్ధితో సోనియా గాంధీ రాష్ట్ర విభజనకు పాల్పడింది. తెలంగాణలో కేసీఆర్‌తో, సీమాంధ్రలో జగన్‌తో పొత్తు కుదుర్చుకుని 2014లో అధికారం చేపట్టాలని కాంగ్రెస్ కలలు కంటుంది. అక్రమ సంపాదన కేసులో జగన్‌కు బెయిల్ రావడం ఈ ఒప్పందంలో భాగమే. అధికార దాహంతో సోనియా తెలుగుజాతిని రెండుగా చీల్చి తీరని ద్రోహానికి పాల్పడిందని బీద దుయ్యబట్టారు. కేసీఆర్, జగన్‌లు ప్రజలను మోసగిస్తున్నారు. రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌ను ఛీదరించుకుంటుంటే వీళ్లు అదే కాంగ్రెస్‌కు ఊడిగం చేస్తున్నారు. వీళ్లిద్దరికీ ప్రజలు గుణపాఠం చెప్పే సమయం ఆసన్నమైందన్నారు. సోనియా పాదాలు పట్టుకుని బెయిల్ తెచ్చుకున్న వై.యస్. కుటుంబం, సిగ్గులేకుండా జగన్ కడిగిన ముత్యంలా బయటకొచ్చాడంటూ బజారుకెక్కి ప్రకటించుకోవడం విచారకరమన్నారు. రాయలసీమ రోషం, కడప పౌరుషాలను సోనియా కాళ్ల వద్ద తాకట్టు పెట్టిన వై.యస్. కుటుంబానికి ఇంకొకరిని వేలెత్తి చూపే అర్హత లేదన్నారు. అటు ఇటు కాని నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తాము అధికారంలోకి వస్తే చంద్రబాబును చెట్టుకు కట్టేసి కొడతామని వాగుతున్నాడని, ఇకముందు ఇలాగే మాట్లాడితే తగిన శాస్తి చేస్తామన్నారు. జగన్‌తో మ్యాచ్ ఫిక్సింగ్ కారణంగానే సిబిఐలో నిజాయితీపరులైన అధికారులను, న్యాయవాదులను మార్చి ఆయనకు బెయిల్ వచ్చేలా కాంగ్రెస్ సహకరించిందన్నారు.

ఈ సమావేశంలో తెలుగుదేశం నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నూనె మల్లికార్జునయాదవ్, చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, కె.తిరుమలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



చెన్నైలోని ఐటిసి గ్రాండ్‌చోళాలో జరిగిన దక్షిణభారత చలనచిత్ర వేడుకల్లో దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావును కలిసిన నెల్లూరీయులు బెగోరె అవార్డు కమిటీ కార్యదర్శి జి.వి.నరసింహం, రచయిత పిరుగు రామకృష్ణ, ప్రపంచ తెలుగుసమాఖ్య నెల్లూరు రీజియన్ కన్వీనర్ ఎన్.బలరామయ్యనాయుడు

Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323+o5. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**.